

# విభారె
## తెలుగు దినపత్రిక
## VIBHARE TELUGU DAILY




PUBLISHED FROM KURNOOL ఎడిటర్: ఆవుల విజయ భాస్కర రెడ్డి మంగళవారం 11 జనవరి 2022 సంపుటి: 03 సంచిక: 133 పేజీలు: 4 వెల: రూ 3-00

# ప్రధాని భద్రతా లోపంపై విచారణ కమిటీ ఏర్పాటు చేసిన సుప్రీం




న్యూఢిల్లీ: ప్రధాని మోదీ పంజాబ్ పర్యటనలో భద్రతా లోపంపై సోమవారం సుప్రీం కోర్టులో విచారణ జరిగింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం విచారణ చేపట్టింది. కేంద్రం తరపున సొలిసిటర్ జనరల్, పంజాబ్ ప్రభుత్వం తరపున అడ్వకేట్ జనరల్ వాదనలు వినిపించారు. వాదనలు విన్న ధర్మాసనం.. భద్రతా లోపంపై సుప్రీంకోర్టు రిటైర్డ్ జడ్జి నేతృత్వంలో విచారణ కమిటి ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. సుప్రీం కోర్టు ప్రతిపాదనపై కేంద్ర సొలిసిటర్ జనరల్, పంజాబ్ అడ్వకేట్ జనరల్ ఇద్దరూ తమకు అభ్యంతరం లేదని చెప్పారు. విచారణ కమిటిలో సభ్యులుగా చండీగఢ్ డీజీపీ, హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్, ఎన్ఐఏకు చెందిన ఐజీ, ఐబీ అధికారులు కూడా ఉంటారని, కమిటీలో పంజాబ్ నుంచి కూడా ప్రతినిధ్యం ఉంటుందని సీజేఐ ఎన్వీ రమణ వెల్లడించారు. పంజాబ్ ప్రభుత్వం తరపున వాదించిన అడ్వకేట్ జనరల్ స్పందిస్తూ.. కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన విచారణ కమిటీపై తమకు నమ్మకం లేదని, స్వతంత్ర విచారణ కమిటీ ఏర్పాటు చేయాలని కోరారు. సుప్రీంకోర్టులో విచారణకు ముందే పంజాబ్ అధికారులను దోషులుగా చిత్రీకరిస్తూ.. షోకాజ్ నోటీసులు ఇచ్చారని ధర్మాసనానికి ఏజీ తెలియజేశారు. ఏజీ వాదనలపై సీజేఐ స్పందిస్తూ.. దోషులుగా చిత్రించి చర్యలు తీసుకుంటూ.. షోకాజ్ నోటీసులు ఇచ్చిన తర్వాత తాము విచారణ చేపట్టాల్సిన అవసరం ఏముందని కేంద్రాన్ని ప్రశ్నించారు. ప్రధాని భద్రతకు సంబంధించిన విషయంపై ఎస్పీజీ చట్టం ప్రకారం సంబంధిత అధికారులను ప్రశ్నించే అధికారం కేంద్రానికి ఉందంటూ సొలిసిటర్ జనరల్ సమాధానం ఇచ్చారు. అంతేకాకుండా ప్రధాని పర్యటన ముందుగానే ఖరారైందని, వాతావరణ పరిస్థితుల దృష్ట్యానే రోడ్డు మార్గాన్ని ఎంచుకున్నారని, ఆ విషయం కూడా ముందుగానే రాష్ట్ర ఏజన్సీలకు సమాచారం ఇచ్చినట్లు ఎస్జీ తెలిపారు. ప్రధాని వాహనశ్రేణికి ముందు ఉన్న సెక్యూరిటీ వాహనం 100 మీటర్ల సమీపానికి వచ్చే వరకు పంజాబ్ అధికారులు రోడ్డు క్లియర్‌గా ఉందని తప్పుడు సమాచారం ఇచ్చారని సొలిసిటర్ జనరల్ పేర్కొన్నారు.ప్రధాని భద్రత వ్యవహారం కాబట్టే తమ ముందుకు వచ్చిన పిటిషన్‌ను విచారణకు తీసుకున్నామని, అయితే కేంద్రం ముందుగానే ఫలానా అధికారులు బాధ్యులు అంటూ చర్యలకు ఉపక్రమిస్తే ఇక తాము విచారణ చేపట్టేది ఏముంటుందని సీజేఐ ఎన్వీ రమణ ప్రశ్నించారు. పంజాబ్ అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేయడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. తమ భయం నిజమైందని, ఇప్పటికే 7 షోకాజ్ నోటీసులు జారీ చేశారని ధర్మాసనానికి పంజాబ్ అడ్వకేట్ జనరల్ వివరించారు. విచారణ జరగకుండా, కనీసం తమ అభిప్రాయాన్ని వెల్లడించే అవకాశం కూడా లేకుండానే తమ రాష్ట్ర అధికారులకు కేంద్రం షోకాజ్ నోటీసులు ఇచ్చిందని చెప్పారు. కేంద్రానికి చెందిన ఏ ఏజెన్సీ విచారణ చేపట్టినా వాస్తవాలు వెలుగులోకి రావని, స్వతంత్ర కమిటీని ఏర్పాటు చేయాలని కోరారు. ఒకవేళ రాష్ట్ర అధికారులు దోషులు గా తేలితే తనను, తన ప్రభుత్వ అధికారు లను ఉరితీయాలంటూ పంజాబ్ అడ్వకేట్ జనరల్ వాదించారు. వాదనలు విన్న ధర్మాసనం.. విచారణ కమిటీలో పంజాబ్‌కు ప్రాతినిధ్యం ఉంటుందని చెప్పడంతో ఏజీ అంగీకారం తెలిపారు. విచారణ కమిటీలోని సభ్యుల పేర్లు ఈ రోజు సాయంత్రం వెల్లడించే అవకాశం ఉంది.

# 144 ఆక్సిజన్ ప్లాంట్లను జాతికి అంకితం చేస్తున్నాం: సీఎం జగన్



తాడేపల్లి: ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తాడేపల్లిలోని సీఎం క్యాంప్ కార్యాలయం నుంచి వర్చువల్‌గా రాష్ట్రంలోని 144 ఆక్సిజన్ ప్లాంట్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం జగన్ మాట్లాడుతూ.. 144 ఆక్సిజన్ ప్లాంట్లను జాతికి అంకితం చేస్తున్నామని? తెలిపారు. 100 పడకలు ఉన్న ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఆక్సిజన్ ప్లాంట్లపై 30 శాతం సబ్సిడీ అందిస్తున్నామని తెలిపారు.ప్రతి ప్రభుత్వాస్పత్రిలో ఆక్సిజన్ సౌలభ్యం అందిస్తున్నామని సీఎం జగన్ చెప్పారు. ఒక్కో ప్లాంట్‌లో నిమిషానికి వెయ్యి లీటర్ల ఆక్సిజన్ ఉత్పత్తి అవుతుందని తెలిపారు. అదేవిధంగా కోవిడ్‌ను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.సెకండ్ వేవ్‌లో ఆక్సిజన్ విమానాల్లో తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని, ప్రస్తుతం మనమే సొంతంగా ఆక్సిజన్ సరఫరా చేసేలా చర్యలు తీసుకుంటున్నామని సీఎం తెలిపారు. కోవిడ్ పరిస్థితుల్లోనూ వ్యవసాయం, విద్య, వైద్య రంగాలను అభివృద్ధి చేశామని పేర్కొన్నారు.రూ.20కోట్ల వ్యయంతో ఆక్సిజన్ క్రయోజనిక్ ఐఎస్ఓ కంటైనర్లు కొనుగోలు చేశామని సీఎం జగన్ తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 24,419 బెడ్‌లకు ఆక్సిజన్ పైప్‌లైన్ల సౌకర్యం కల్పించనున్నామని తెలిపారు. 74 లిక్విడ్ మెడికల్ ఆక్సిజన్ ట్యాంకులు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. 163 కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో పీడియాట్రిక్ కేర్ యూనిట్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రాష్ట్రంలో 20 అత్యాధునిక ఆర్‌టీపీసీఆర్ వైరల్(వీఆర్‌డీఎల్) ల్యాబ్‌లు ఏర్పాటు చేశామని సీఎం తెలిపారు. విజయవాడలో జీనోమ్ సీక్వెన్సింగ్ ల్యాబ్ ఏర్పాటు చేశామని పేర్కొన్నారు.రాష్ట్రంలో 18 ఏళ్లు పైబడిన వారికి వ్యాక్సినేషన్ పూర్తి చేశామని సీఎం జగన్ చెప్పారు. 80 శాతం మందికి రెండు డోసులు ఇవ్వగలిగామని సీఎం పేర్కొన్నారు. ఇప్పటి వరకు 82 శాతం టీనేజర్లకు వ్యాక్సినేషన్ పూర్తి చేశామని తెలిపారు. 82 శాతం వ్యాక్సినేషన్‌తో దేశంలో అగ్రస్థానంలో? ఉన్నామని సీఎం జగన్ పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 33 సార్లు డోర్ టూ డోర్ సర్వే చేశామని తెలిపారు. కోవిడ్ మేనేజ్‌మెంట్‌లో వైద్యశాఖ దేశానికే ఆదర్శంగా నిలిచిందని సీఎ జగన్ పేర్కొన్నారు.

# నేటినుండి ఆంధ్రప్రదేశ్‌లో నైట్ కర్ఫ్యూ



అమరావతి జనవరి 10 కరోనా వైరస్ రోజురోజుకు విజృంభిస్తున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. రాష్ట్రంలో నైట్ కర్ఫ్యూను విధిస్తూ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ఆదేశాలు జారీ చేసింది. సోమవారం కోవిడ్ పరిస్థితులపై అధికారులతో సీఎం జగన్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో రాత్రి 11 గంటల నుంచి ఉదయం 5 గంటల వరకూ కర్ఫ్యూ విధించాలని ఆదేశించారు. భౌతిక దూరం పాటించేలా, మాస్క్‌లు కచ్చితంగా ధరించేలా చూడాలన్నారు. మాస్క్‌లు ధరించకపోతే జరిమానాను కొనసాగించాలని స్పష్టం చేశారు. దుకాణాల్లో, వ్యాపార సముదాయాల్లో కోవిడ్ ఆంక్షలు పాటించేలా చూడాలని అధికారులకు తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో 200 మంది, ఇన్‌డోర్స్‌లో100మందిమించకుండాచూడాలని సీఎం ఆదేశించారు. థియేటర్లలో సీటు మార్చి సీటుకు అనుమతించాలని...అలాగే మాస్క్ తప్పనిసరి చేయాలన్నారు. దేవలయాలు, ప్రార్థనా మందిరాల్లో కూడా భౌతిక దూరం పాటించేలా, మాస్క్ ధరించేలా చూడాలని సీఎం జగన్ ఆదేశాలు జారీ చేశారు.

# కరోనా డేంజర్ బెల్స్

__హడలిపోతున్న విశాఖ వాసులు__

__భయం గుప్పిట్లో విశాఖ ఉక్కు కర్మాగారం ఉద్యోగులు, కుటుంబాలు__

__ఒక్క రోజులో 60 కరోనా పాజిటీవ్ కేసులు నమోదు__

__స్టీల్ ప్లాంట్ జనరల్ ఆసుపత్రిలో గర్భిణికి కరోనా పాజిటీవ్__


__డెలివరీ చేసిన డాక్టర్లు, తల్లి బిడ్డ క్షేమంతో ఊపిరిపీల్చుకున్న వైద్య సిబ్బంది__




విశాఖపట్నం ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణకి వ్యతిరేకంగా ఉద్యమం చేస్తున్న ఉద్యోగులలో ఎక్కువ శాతం కరోనా పాజిటీవ్ కేసులు నమోదు కావడం కలవరం రేపింది. ఒక్క రోజులో 60 కరోనా పాజిటీవ్ కేసులు నమోదు అయ్యాయి. స్టీల్ ప్లాంట్ జనరల్ ఆసుపత్రిలో గర్భిణికి కరోనా పాజిటీవ్ వచ్చింది. డాక్టర్లు ఆమెకు డెలివరీ చేసారు. తల్లి బిడ్డ క్షేమంగా వుండడతో వైద్య సిబ్బంది ఊపిరిపీల్చుకున్నారు. మరోవైపు, సంక్రాంతీ సెలవులు కావడంతో జనం విచ్చలవిడిగా రోడ్డల పైకి వస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు హెచ్చరికలను జనాలు భేఖాకతరు చేస్తున్నారు. కరోనా వైరస్ విజృంభిస్తున్న సమయంలో కూడా కనీస నియమాలు కుడా పాటించడంలేదు. ఉక్కు కర్మాగారం ఉద్యోగులే ఎక్కువగా కరోనా భారీన పడటం మరో విశేషం

# ఏపీలో కొత్తగా 984 కరోనా కేసులు

అమరావతి: గడిచిన 24 గంటల్లో ఏపీలో కొత్తగా 984 కరోనా పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. ఈ రోజు నమోదయిన కేసులతో కలిపి రాష్ట్రంలో మొత్తం 20,82,843 పాజిటివ్ కేసులు చేరాయి. కరోనాతో 14,505 మంది మృతి చెందారు. ప్రస్తుతం 5,606 యాక్టివ్ కేసులున్నాయి. కరోనా నుంచి 20,62,732 రికవరీ అయ్యారు. మరోవైపు కరోనా వైరస్ రోజురోజుకు విజృంభిస్తున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. రాష్ట్రంలో నైట్ కర్ఫ్యూను విధిస్తూ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ఆదేశాలు జారీ చేసింది. సోమవారం కోవిడ్ పరిస్థితులపై అధికారులతో సీఎం జగన్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో రాత్రి 11 గంటల నుంచి ఉదయం 5 గంటల వరకూ కర్ఫ్యూ విధించాలని ఆదేశించారు. భౌతిక దూరం పాటించేలా, మాస్క్‌లు కచ్చితంగా ధరించేలా చూడాలన్నారు. మాస్క్‌లు ధరించకపోతే జరిమానాను కొనసాగించాలని స్పష్టం చేశారు.



# మర్రిపాడు మండల సర్వసభ్య సమీక్ష సమావేశం

__ఎంపీ ఆదాలతో కలిసి హాజరైన మంత్రి మేకపాటి__

మర్రిపాడు నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్ రెడ్డితో కలిసి ఐటి మంత్రి మేకపాటి గౌతమ్ రెడ్డి సోమవారం మర్రిపాడు మండలకేంద్రంలో మండల అభివృద్ధి కార్యాలయ ప్రాంగణంలో సర్వసభ్య సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ ఆలస్యంగా జరిగే న్యాయం కూడా అన్యాయమే నని అన్నారు రెవెన్యూలో ఈ పరిస్థితి ఎక్కువగా ఉందని ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఆలస్యాన్ని, నిర్లక్ష్యాన్ని సహించనని అధికారులకు నేనిచ్చే స్వేచ్ఛ మరెవరూ ఇవ్వరు అని అయినా ప్రజలను పదే పదే తిప్పుకుంతున్నారని అలా చేస్తే సహించేది లేదుఅని అధికారులకు తెలియజేసారుఎంపీ ఆదాల ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ డెత్ సర్టిఫికెట్, ఫ్యామిలీ సర్టిఫికెట్ లు గ్రామాల్లో సాధ్యం కావని గతంలో మరణాలకు సంబంధించి స్వయంగా వెళ్ళి అధికారులే పరిశీలించి, పరిశోధించి సరైన నిర్ణయం తీసుకోవాలని ఎంపీ తెలియజేసారు డిజిటల్ అసిస్టెంట్ ల లాగిన్ ద్వారా గ్రీవెన్స్ రేజ్ చేసి, భూమి అదనంగా పడినట్లు సాంకేతికంగా సర్వీస్ రిక్వెస్ట్ చేయాలి అని జేసీ వివరించారు మంత్రి అధ్యక్షతన జరిగిన రెవెన్యూ సంబంధిత గ్రీవెన్స్ పై ప్రధానంగా దృష్టి పెట్టిన మంత్రి మేకపాటి మండలాన్ని ఆరు ఎంపీటీసీ సెగ్మెంట్లవారీగా విడమరిచి మంత్రి చర్చ జరిగింది.సింగనపల్లిలో పొలాల దారులు, స్మశాన స్థలాలకు సంబంధించిన సమస్యలు ప్రధానంగా ఉన్నట్లు మంత్రి మేకపాటి దృష్టికి గ్రామస్తులుతీసుకువచ్చారు.రికార్డ్ ఆఫ్ రైట్స్ సవరణలతో హక్కుదారులకు సాదా బైనామా ప్రకారంభూములనుఅప్పగిస్తామని జాయింట్ కలెక్టర్ మంత్రికి వెల్లడించారు.ప్రభుత్వం రీ సర్వే చేసి శాశ్వత భూ హక్కు కల్పించనుందని మంత్రి గౌతమ్ రెడ్డి తెలియజేసారు అనాదీన భూమిని అసైన్ ల్యాండ్ మార్చే ప్రక్రియ గురించి జేసీ వివరించారు 6వ విడత భూ పంపిణీ సరిగా జరగలేదని, క్షేత్రస్థాయిలో పరిస్థితిని వివరించి జిల్లా అధికారులకు పంపుతామని ఎమ్ఆర్వో హమీద్‌తెలిపారు.

# రైతుల నుంచి నేరుగా ధాన్యం కొనుగోలు: గిరిజా శంకర్

అమరావతి: రైతుల నుంచి నేరుగా ధాన్యం కొనుగోలు చేస్తున్నామని పౌర సరఫరాల శాఖ కమిషనర్ గిరిజా శంకర్ తెలిపారు. సోమవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ, 50 లక్షల మెట్రిక్ టన్నుల సేకరణకు ఏర్పాట్లు చేస్తున్నామని పేర్కొన్నారు.“ఇప్పటి వరకు 17 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశాం. రోజుకి 50 వేల నుండి లక్ష మెట్రిక్ టన్నులను కొంటున్నాం. రైతులకు 21 రోజుల్లో ధాన్యం డబ్బులు ఇస్తున్నాం రూ.1,153 కోట్లు రైతులకు డబ్బులు చెల్లించాం. మిల్లర్ల ప్రమేయం లేకుండా ఆర్‌బీకేల ద్వారా కొనుగోలు చేస్తున్నాం. ఈ సారి నూరు శాతం ఈ క్రాప్ చేశాం.



అక్రమాలకు ఆస్కారం లేకుండా ఈ క్రాప్ డేటాని వినియోగిస్తున్నాం. ప్రతి రైతు ఖాతాని ఆధార్‌కి అనుసంధానం చేశాం.దళారులు లేకుండా నేరుగా రైతు ఖాతాల్లో డబ్బులు వేస్తున్నాం. 80 శాతం మందికి డబ్బులు ఇవ్వడం లేదనడం అవాస్తవం.

# సంపాదకీయం

మంగళవారం 11 జనవరి 2022

## ముంచుకొస్తున్న ఎన్నికలు కమ్ముకొస్తున్న కరోనా

కరోనా మళ్లీ కమ్ముకుంటున్న వేళ ఎన్నికలు నిర్వహించే సాహసం ఎన్నికల సంఘం చేయకపోవచ్చనే అనుకున్నారంతా! ఎన్నికల సంఘం మాత్రం ఎన్నికలకు పచ్చ జెండా ఊపింది. రాజకీయ పార్టీల అభిలాషనో, అభ్యర్థనో తెలియదు కానీ ఈసీ పెద్ద బాధ్యతనే నెత్తినేసుకుంది. అయిదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలకు నోటిఫికేషన్ రావడంతో రాజకీయపార్టీలు వ్యూహప్రతివ్యూహాల లలో నిమగ్నమయ్యాయి. 15 వరకు రోడ్‌షోలు, ర్యాలీలపై ఎన్నికల సంఘం నిషేధం విధించింది కాబట్టి పండుగ తర్వాత ఎన్నికల సమరాంగణంలో దూకాలని డిసైడయ్యాయి. మాస్క్, థర్మల్ స్కానర్లు, శానిటైజేషన్ ఇలాంటి లాజిస్టిక్స్ అన్ని పోలింగ్ కేంద్రాలలో ఉంచుతామని కేంద్ర ఎన్నికల సంఘం చెబుతోంది.. ఇన్నేసి జాగ్రత్తలు ఎన్నికల సంఘం తీసుకుంటుంది సరే.. రాజకీయపార్టీలు కూడా తగు జాగ్రత్తలు పాటిస్తాయా అన్నది అనుమానమే!మరో రెండు నెలలు ఆగితే సికందర్ ఎవరో తెలిసిపోతుంది. అప్పటివరకు ఎవరికి తోచిన లెక్కలు వారేసుకుంటున్నారు. ఓ విధంగా చూస్తే 2024లో జరిగే సార్వత్రిక ఎన్నికలను ఫైనల్స్‌గా పరిగణిస్తే ఇప్పుడు జరిగే ఎన్నికలు సెమీ ఫైనల్స్ లాంటివి. ఇందులో జయాపజయాలను బట్టి 2024లో గెలిచేదెవరన్నదానిపై ఓ అంచనాకు రావచ్చు. ఎన్నికలు జరగబోయే అయిదు రాష్ట్రాలలో అందరి చూపు ఉత్తరప్రదేశ్ మీదనే ఉంది. పెద్ద రాష్ట్రమని కాదుగానీ.. దేశ రాజకీయాలపై యూపీ బలమైన ముద్ర వేస్తుంది కాబట్టి. ఎన్నికలు జరుగుతున్న 690 అసెంబ్లీ స్థానాలలో58 శాతం అసెంబ్లీ సీట్లు ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందినవే! ఉత్తరప్రదేశ్ ఫలితం 2024లో జరిగే ఎన్నికలపై కచ్చితంగా ప్రభావం చూపుతుంది. పైగా త్వరలో 74 రాజ్యసభ స్థానలకు జరిగే ఎన్నికపై కూడా ప్రభావం చూపుతుంది. యూపీలో విజయం సాధించి రాజ్యసభలో కూడా బలం పెంచుకోవాలన్నది బీజేపీ ఉద్దేశం!ఇంకోటి కూడా ఉంది. రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింగ్ పదవీకాలం జులైలోముగుస్తుంది. కొత్త రాష్ట్రపతిని ఎన్నుకునే ఎలక్టొరల్ కాలేజ్‌లో ఓట్ల సంఖ్యను గణనీయంగా పెంచుకోవాలని బీజేపీ అనుకుంటోంది. ఇప్పుడు ఎన్నికలు జరగబోయే అయిదు రాష్ట్రాలలో నాలుగు రాష్ట్రాలలో బీజేపీనే అధికారంలో ఉంది.. అయిదో స్టేట్‌ను కూడా దక్కించుకోవాలన్నది బీజేపీ లక్ష్యంగా పెట్టుకుంది. ఉత్తరప్రదేశ్‌లో బీజేపీ అధికారాన్ని నిలబెట్టుకోగలదని సర్వేలైతే చెబుతున్నాయి కానీ ఎన్నికల సమయానికి సమీకణాలు మారిపోవచ్చు. ఇప్పటికైతే బీజేపీ, సమాజ్‌వాదీపార్టీల మధ్యనే గట్టిపోటీ కనిపిస్తోంది. బీఎస్పీ, కాంగ్రెస్‌లకు సంప్రదాయ ఓటు బ్యాంకు ఉండనే ఉంది. ఇప్పుడు కొత్తగా ఆమ్ ఆద్మీ పార్టీ రంగంలోకి దిగబోతున్నది. 2017లో జరిగిన ఎన్నికల్లో బీజేపీ 312 స్థానాలతో అఖండ విజయాన్ని నమోదు చేసుకుంది. అప్పట్లో మోదీ హవా బ్రహ్మాండంగా ఉండింది. ఇప్పుడు బీజేపీ అన్ని స్థానాలు గెలవడం అసాధ్యమే! అందుకు కారణం ఆదిత్యనాథ్ యోగి ప్రభుత్వంపై ప్రజలలో కొంచెం అసంతృప్తి రావడమే! ఈ లోటును పూడ్చుకునేందుకు ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి అమిత్ షా, ముఖ్యమంత్రి యోగి ప్రచార భారాన్ని భుజాన వేసుకున్నారు.ఇప్పటికే పలు సంక్షేమ కార్యక్రమాలలకు మోదీ వచ్చి శంకుస్థాపన చేశారు. పలు ఎన్నికల హామీలను ప్రకటించారు. మరోవైపు సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్ కూడా ఏ అవకాశాన్ని వదులుకోవడం లేదు. చిన్న పార్టీలను కలుపుకున్నారు. ఇప్పటికే ఆర్ఎల్‌డీ, సుహెల్‌దేవ్ భారతీయ సమాజ్ పార్టీలతో పొత్తు పెట్టుకున్నారు. మరోవైపు కాంగ్రెస్ ఓటు శాతం కొంచెం పెరిగింది. ర్యాలీలు, సభలతో ప్రియాంకగాంధీ ప్రజలకు చేరువయ్యే ప్రయత్నం చేస్తున్నారు. ఒకప్పుడు దళిత ఓటు బ్యాంకు బహుజన్‌సమాజ్ పార్టీకి చెక్కుచెదరకుండా ఉండేది. ఇప్పుడు బీజేపీకి కొందరు షిఫ్టయ్యారు. ఉత్తరప్రదేశ్ తర్వాత అందరి చూపు పంజాబ్‌పై ఉంది. ప్రస్తుతం కాంగ్రెస్ అక్కడ అధికారంలో ఉంది. అంతర్గత విభేదాలు ఆ పార్టీకి తలనొప్పిగా మారాయి. కాంగ్రెస్‌లో ఇమడలేక అమిరీందర్ సింగ్ అందులోంచి బయటకు వచ్చి సొంతంగా పార్టీ పెట్టుకున్నారు. ఇప్పుడు కాంగ్రెస్‌ను విజయతీరాలకు చేర్చే బాధ్యత నవజోత్‌సింగ్ సిద్ధూ, ముఖ్యమంత్రి చరణ్‌జిత్ సింగ్ చన్నీలపైనే ఉంది. కాంగ్రెస్ గెలుపు గ్యారంటీ అనుకున్న సమయంలో ఆప్ తన బలాన్ని అమాంతం పెంచుకుంది. పంబాజ్‌లో గెలుస్తామన్న నమ్మకం బీజేపీకి ఎలాగూ లేదు. అందుకే అమరీందర్ సింగ్ నేతృత్వంలోని పంజాబ్ లోక్ కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకుంది. ఉత్తరాఖండ్‌లో కూడా కాంగ్రెస్, బీజేపీ మధ్య గట్టి పోటీ కనిపిస్తోంది. ఎవరు గెలుస్తారన్నది కచ్చితంగా చెప్పలేని పరిస్థితి. ఇక్కడ కూబా ఆమ్ ఆద్మీ పార్టీ గణనీయంగా పుంజుకుంది. ఆప్ ఎవరి ఓట్లు చీలుస్తుందన్నదే ప్రశ్న. ప్రస్తుతం అధికారంలో ఉన్న బీజేపీ ముగ్గురు ముఖ్యమంత్రులను మార్చింది.. ఇదే ఆ పార్టీకి ప్రతికూలంగా మారింది. పైగా అయిదేళ్లకోసారి ప్రభుత్వాలు మారడమనేది ఉత్తరాఖండ్‌లో ఆనవాయితీగా వస్తోంది. ఆ లెక్కన ఈసారి కాంగ్రెస్ అధికారంలోకి రావాలి. మరి ఓ పక్క బీజేపీని, మరో పక్క ఆప్‌ను ఎదుర్కొని కాంగ్రెస్ ఎలా నెగ్గుకు రాగలుగుతుందో చూడాలి.మణిపూర్‌లో ప్రస్తుతం ఎన్డీయే అధికారంలో ఉంది. గత ఎన్నికల్లో యూపీఏకు 28 స్థానాలు వస్తే ఎన్డీయేకు వచ్చినవి 21 సీట్లే. అయినా బీజేపీ సారథ్యంలోని ఎన్డీయే అధికారంలో రాగలిగింది. స్వతంత్ర అభ్యర్థులను తమవైపు లాగేసుకోగలిగింది. గోవాలో కూడా అంతే. లాస్ట్ ఎలెక్షన్‌లో యూపీఏ 17 స్థానాలు సంపాదించింది. ఎన్డీయేకు వచ్చినవి 13 సీట్లే. అయినా అక్కడా అధికారంలోకి రాగలిగింది. ఈసారి ఎన్నికల్లో తృణమూల్ కాంగ్రెస్ కూడా తన అదృష్టాన్ని పరీక్షించుకోబోతున్నది. మొత్తంమీద అయిదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు అమితాసక్తిని కలిగిస్తున్నాయి.

## బిజెపి నేత బుడ్డా శ్రీకాంత్ రెడ్డి పై దాడి నిరసనగా ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా



నంద్యాల నంద్యాల పట్టణంలో సోమవారం నాడు ఆర్డీవో కార్యాలయం ఎదుట బిజెపి నాయకులు ధర్నా నిర్వహించారు. ఆత్మకూరులో బిజెపి నాయకుల అక్రమ అరెస్టుకు వ్యతిరేకంగా నిరసన మరియు ఆంధ్ర ప్రదేశ్లో వైసిపి ప్రభుత్వం చేస్తున్న హిందూ వ్యతిరేక, ముస్లిం అనుకూల రాజకీయాలకు వ్యతిరేకంగా నిరసనలు వ్యక్తం చేశారు. వైసీపీ ప్రభుత్వం చేస్తున్న హిందూ వ్యతిరేక, ముస్లిం అనుకూల బుజ్జగింపు రాజకీయాలకు వ్యతిరేకంగా జనవరి 10న రాష్ట్రవ్యాప్త నిరసనలకు బీజేపీ ఆంధ్రప్రదేశ్ పిలుపునిచ్చింది. జనవరి 8న, హిందూ బలిజలు అధికంగా ఉన్న ప్రాంతంలో మసీదును అక్రమంగా నిర్మించడాన్ని శాంతియుతంగా వ్యతిరేకించినందుకు ఆత్మకూరు పట్టణం (నంద్యాల పార్లమెంట్ నియోజకవర్గం) లో కొన్నివేల మంది ముస్లింల హింసాత్మక గుంపు బిజెపి జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి, ఇతర బిజెపి నాయకులపై దాడి చేసింది. ఒకటిన్నర సంవత్సరాల క్రితం మసీదు నిర్మించడానికి ప్రయత్నించారు. హిందువులు నిరసన వ్యక్తం చేయడం మరియు మసీదు నిర్మాణానికి అనుమతి ఇవ్వకపోవడంతో ఆలోచన విరమించుకోవలసి వచ్చింది. రెండు రోజుల క్రితం, స్థానిక ముస్లింలు స్థానిక ఎమ్మెల్యే (శ్రీశైలం అసెంబ్లీ)తో చర్చించిన తర్వాత, అకస్మాత్తుగా మసీదు నిర్మాణాన్ని చేపట్టారని ఆరోపించారు . శాంతియుతంగా అభ్యంతరం తెలిపేందుకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్రెడ్డి తదితరులు స్థానిక పోలీసులతో కలిసి అక్కడికి వెళ్లారు. ముస్లింలు బీజేపీ జిల్లా అధ్యక్షుడు, ఇతర నాయకులు, పోలీసులపై కూడా రాళ్లతో దాడి చేసి హత్యాకాండకు పాల్పడ్డారు. జిల్లా అధ్యక్షుడి కారును దుండగులు దగ్ధం చేయడంతో పూర్తిగా ధ్వంసమైంది. రక్షణ కోసం స్థానిక పోలీస్ స్టేషన్కు చేరుకున్నాడు. వేలాది మంది ముస్లింల గుంపు పోలీస్ స్టేషన్ను చుట్టుముట్టి పోలీసులపై రాళ్లతో దాడి చేసిందన్నారు . పోలీసులు గాలిలోకి అనేక రౌండ్లు కాల్పులు జరిపారు. ముస్లిం మూకల దాడిలో పార్టీ కార్యకర్తలే కాకుండా పలువురు పోలీసులు, మరికొందరు జర్నలిస్టులు కూడా గాయపడ్డారని తెలిపారు . వైసీపీ ప్రభుత్వ హయాంలో హిందువుల మనోభావాలు ఎలా దెబ్బతింటున్నాయో ఈ ఘటన తెలియజేస్తోందని అన్నారు . పూర్తిగా హిందూ బలిజ జాతి ప్రజలు నివసించే ప్రాంతంలో అనుమతి లేకుండా మసీదు నిర్మించేందుకు స్థానిక ఎమ్మెల్యే ముస్లింలకు సహకరించారని ఆరోపించారు . ముస్లిం ఓటు బ్యాంకును దృష్టిలో పెట్టుకుని ఎమ్మెల్యే బాధ్యతారాహిత్యంగా, పక్షపాత ధోరణితో వ్యవహరించారని విమర్శించారు . నిన్న పార్టీ జిల్లా అధ్యక్షుడితో పాటు ఐదుగురు నేతలపై పోలీసులు కేసులు నమోదు చేశారని తెలిపారు ..వేలాది మంది ముస్లింలు మన నాయకులపై, పోలీసు సిబ్బందిపై దాడి చేస్తే, కేవలం 20 మందిపై మాత్రమే కేసులు పెట్టారని తెలిపారు. రాడికల్ గ్రూపులకు వైసీపీ ప్రభుత్వ మద్దతు పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా, దాని రాజకీయ విభాగమైన యస్ డి పి ఐ వంటి విపరీతమైన మతోన్మాద సంస్థల పెరుగుదలకు రాష్ట్రవ్యాప్తంగా, ఎక్కువగా రాయలసీమ మరియు నెల్లూరు జిల్లాలలో ఆజ్యం పోసిందని అన్నారు . హిందువులపై వైసీపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రతీకార వైఖరిని బట్టబయలు చేసేందుకు, ముస్లింలపై నేరపూరిత చర్యలను విస్మరిస్తున్నందుకు రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు . బీజేపీ నేతలపై దాడి చేసిన వారందరిపై హత్యాయత్నం (ఐపీసీ సెక్షన్ 307), నేరపూరిత కుట్ర (సెక్షన్ 120బి) మరియు ఇతర సంబంధిత సెక్షన్ల కింద కేసు నమోదు చేసి అరెస్టు చేయాలి.చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకుని పోలీసు స్టేషన్ మరియు పోలీసు సిబ్బందిపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు .అక్రమంగా మసీదు నిర్మాణాన్ని నిర్మించినందుకు, అక్రమాలకు పాల్పడినందుకు, శత్రుత్వాన్ని ప్రోత్సహించినందుకు మరియు సామరస్య పరిరక్షణకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడినందుకు మరియు అల్లర్లకు కారణమైన వారిని తప్పనిసరిగా అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు . నాయకులను విడుదల చేసే వరకు, నిజమైన ముస్లిం నిందితులను అరెస్టు చేసి విచారించే వరకు మరియు మసీదు నిర్మాణ ప్రయత్నాన్ని తక్షణమే ఆపే వరకు బిజెపి తన నిరసనలను కొనసాగిస్తుంది మరియు ఉధృతం చేస్తుందని తెలిపారు . మీడియా, సోషల్ మీడియాలో తప్పుడు సమాచారం ప్రచారం చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు . బిజెపి నేతలపై పోలీసులు పెట్టిన కేసులను తక్షణమే ఉపసంహరించుకోవాలని కోరారు . రాష్ట్రంలోని రాడికల్ ఇస్లామిక్ గ్రూపుల వల్ల ఏర్పడే నిజమైన ముప్పును అర్థం చేసుకోవడానికి హిందూ సమాజాన్ని మేల్కొల్పడానికి బిజెపి కృషి చేస్తుంది మరియు హిందూ సమాజాన్ని బలహీనపరిచే వారి ప్రణాళికలను విఫలం చేయడానికి ఐక్యం కావాలని పిలుపునిస్తుంది . ఈ కార్యక్రమంలో జిల్లా ఇంచార్జి ,రాష్ట్ర కార్యదర్శి కణంపల్లి చిరంజీవి రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నరసింగారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి మండ్ల గంగాధర్ ,పట్టణ అధ్యక్షుడు ఫిరంగి బ్రహ్మయ్య ఆచారి ,డా.ఇంటి ఆదినారాయణ ,మేడా మురళీధర్ , కశెట్టి క్రిష్ణమూర్తి మండల,జిల్లా నాయకులు పాల్గొన్నారు.

## వలంటీర్లకు ప్రత్యామ్నాయ వ్యవస్థ

గుంటూరు, జనవరి 10, (న్యూస్ పల్స్) తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు వచ్చే ఎన్నికలకు సిద్ధమవుతున్నారు. ఇందుకోసం అన్ని రకాల దారులు వెతుకుతున్నారు. క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేసే దిశగా ప్రయత్నాలు చేస్తున్నారు. 175 నియోజకవర్గాల్లో వాలంటీర్ల వ్యవస్థకు పోటీగా తమ కార్యకర్తలను నియమించాలని చంద్రబాబు నిర్ణయించారు. ఇందుకోసం కసరత్తులు చేస్తున్నారు. నియోజకవర్గాల వారీగా సమీక్షలు జరిపి ఈ వ్యవస్థ ఏర్పాటుపై నేతలతో చర్చించనున్నారు. కుప్పం నియోజకవర్గం పర్యటనలో ఈ విషయాన్ని చంద్రబాబు ప్రకటించారు. వాలంటీర్లతో..... జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత అఫిషియల్ గానే వాలంటీర్ల వ్యవస్థను ఏర్పాటు చేశారు. వీరు ప్రతి యాభై కుటుంబాలకు ఒకరు ఉంటారు. వీరే పింఛన్లతో పాటు మిగిలిన ప్రభుత్వ పథకాలను ఆ కుటుంబాలకు అందజేస్తారు. వీరు వచ్చే ఎన్నికల్లో ప్రభావం చూపే అవకాశముంది. వాలంటీర్ల వ్యవస్థపై ఇప్పటికే అనేకసార్లు చంద్రబాబు ఆరోపణలు చేశారు. 2024 ఎన్నికల్లోనూ వీరి వల్ల ఇబ్బంది ఎదురవుతుందని భావిస్తున్నారు. ప్రతి యాభై ఇళ్లకు... దీంతో వాలంటీర్ల వ్యవస్థకు ధీటుగా కార్యకర్తలను ప్రతి వంద మందికి ఒక ఒకరిని నియమించాలని చంద్రబాబు నిర్ణయించారు. వీరి నియామకం ఈ ఏడాది చివరి నాటికిపూర్తి చేయాలని భావిస్తున్నారు. వీరికి పార్టీ నుంచి కొంత గౌరవ వేతనం కూడా చెల్లించే అవకాశముంది. వీరు తమకు కేటాయించిన వంద మంది వద్దకు వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను వివరించడం, టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు జరిగిన అభివృద్ధిని చెప్పడమే వీరి ప్రధాన విధి. వీరికి సేవామిత్రగా నామకరణం చేశారు.

ఈ ఏడాది చివరి నాటికి... తెలుగుదేశం పార్టీకి 175 నియోజకవర్గాల్లో బలమైన కార్యకర్తలున్నారు. వారిలో నుంచి ఈ విధులను నిర్వహించడానికి ఎంపిక చేయాలని చంద్రబాబు నిర్ణయించారు. ఈఏడాది ప్రారంభంలోనే ఈ నియామకం జరగాలన్నది చంద్రబాబు ఉద్దేశ్యం. కనీసం మరో ఆరునెలల్లో ఈ నియామకాలను పూర్తి చేయా?లని భావిస్తున్నారు. త్వరలోనే అన్ని నియోజకవర్గాల ఇన్ ఛార్జులతో సమావేశమయి ఈ వ్యవస్థ ఏర్పాటు పై చంద్రబాబు నిర్ణయిస్తారని తెలిసింది. వీరినే పోలింగ్ కేంద్రాల్లో ఏజెంట్లుగా కూడా వినియోగించుకోవాలని చంద్రబాబు భావిస్తున్నారు.

## ఇంఛార్జ్ పదవి ఆశిస్తున్నవాళ్లంతా అమరావతికి క్యూ..!

కాకినాడ, జనవరి 10, (న్యూస్ పల్స్) వర్గ విభేదాలు ఆ నియోజకవర్గం టీడీపీలో చిచ్చు పెట్టాయా? కొత్తగా వచ్చే ఇంఛార్జ్‌పై సస్పెన్స్ కొనసాగుతోందా? ప్రస్తుత ఇంఛార్జ్ తగ్గేదే లేదని చెబుతున్నారా? ఇద్దరు మాజీ మంత్రుల ఎత్తుగడ మధ్య టీడీపీ రాజకీయం మలుపులు తిరుగుతోందా?తూర్పుగోదావరి జిల్లా కాకినాడ రూరల్ టీడీపీ కొత్త ఇంఛార్జ్ ఎవరు? ఈ విషయంలో టీడీపీ అధిష్ఠానం ఎందుకు సస్పెన్స్ కొనసాగిస్తోంది? ఆ నియోజకవర్గంలోని తెలుగు తమ్ముళ్లకు అర్థం కావడం లేదట. మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి ప్రస్తుతం టీడీపీ ఇంఛార్జ్‌గా ఉన్నారు. ఆమెకు.. ఆమె భర్త సత్తిబాబుకు చెక్ పెట్టాలని మాజీ మంత్రి చినరాజప్ప వర్గం పావులు కదుపుతున్నట్టు ప్రచారం జరుగుతోంది. మరో మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు వర్గంగా పిల్లి కుటుంబంపై ముద్ర ఉంది. దీంతో ఇక్కడ ఇద్దరు మాజీ మంత్రుల్లో ఎవరి మాట నెగ్గుతుందన్నది ఆసక్తిగా మారింది. ఈ ఆధిపత్య పోరు కారణంగానే కొత్త ఇంఛార్జ్‌ను తేల్చడం లేదనే అనుమానాలు ఉన్నాయట ఎన్నికల్లో ఓడిన తర్వాత నియోజకవర్గాన్ని పిల్లి కుటుంబం వదిలేసిందనే ప్రచారం పార్టీ వర్గాల్లో ఉంది. వైసీపీతో ఢీ అండే ఢీ అనే స్థాయిలో పోరాటాలు లేవన్నది టీడీపీలోని పిల్లి ప్రత్యర్థుల ఆరోపణ. పైగా తెర వెనక వైసీపీతో సత్సంబంధాలు ఉన్నాయని టీడీపీ పెద్దలకు ఫిర్యాదులు వెళ్లాయట. ఇదే సమయంలో సత్తిబాబు కుటుంబానికి చెందిన కొందరు తాము వచ్చే ఎన్నికల్లో జనసేనకు మద్దతిస్తామని చెప్పి ఆడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. వీటన్నింటిని గమనించిన చినరాజప్ప వర్గం స్పీడ్ పెంచింది. ఇంఛార్జ్‌ను మార్చాలనే డిమాండ్ చర్చకు పెట్టేశారు. అయితే తాము టీడీపీని వీడబోమని.. కావాలనే దుష్ప్రచారం చేస్తున్నారని పిల్లి అనంతలక్ష్మి, సత్తిబాబులు తమ నేత యనమలకు స్పష్టం చేశారటఆ మధ్య జరిగిన కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్ ఉపఎన్నికలో 3వ డివిజన్ టీడీపీ అభ్యర్థి నామినేషన్‌ను చివరిక్షణంలో విత్‌డ్రా చేసుకోవడంతో సత్తిబాబుపై విమర్శలు వచ్చాయి. దీనిపై చినరాజప్ప వర్గం టీడీపీ పెద్దలకు ఫిర్యాదు చేసింది కూడా. కొత్త ఇంఛార్జ్‌ను నియమించకపోతే..

రూరల్ నియోజకవర్గంలో టీడీపీ అడ్రస్సే లేకుండా పోతుందనే వాదన చంద్రబాబు దగ్గరకు తీసుకెళ్లారట. ఇవన్నీ చూసిన పిల్లి వర్గం కూడా స్వరం సవరించుకుంది. సొంత సామాజికవర్గానికి ఇంఛార్జ్ పదవి ఇప్పించుకునేందుకే చినరాజప్ప తమపై ఆరోపణలు చేస్తున్నారని మండిపడుతోంది. గతంలో కూడా ఇక్కడి టీడీపీలో వర్గపోరు నడిచినా.. పెద్దగా రోడ్డెక్కిన పరిస్థితులు లేవు.నియోజ కవర్గంలో పార్టీని గాడిలో పెట్టడానికి ఇంఛార్జ్ మార్పునకే చంద్రబాబు మొగ్గు చూపొచ్చన్నది టీడీపీ వర్గాల మాట. ఎవరైతే ఇంఛార్జ్ పదవి ఆశిస్తున్నారో వారంతా టీడీపీ పెద్దల దగ్గరకు వెళ్లి చెప్పాల్సింది చెప్పి వస్తున్నారట. ఇద్దరు మాజీ మంత్రుల మధ్య ఆధిపత్యపోరు కావడంతో సమస్యను చంద్రబాబు తేలిగ్గా పరిష్కరిస్తారా? లేక నాన్చివేత ధోరణిలో ఉంటారా అన్నది ప్రశ్న.

## ఘనంగా జరిగిన కేటరర్స్ అసోసియేషన్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ సమావేశం

తిరుపతి జనవరి 10, (న్యూస్ పల్స్)తిరుచానూరు లో స్థానికంగా గల రామానాయుడు కళ్యాణ మండపం లో కేటరర్స్ అసోసియేషన్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ సమావేశం ఘనంగా జరిగింది. ఈ సమావేశానికి చిత్తూరు,కడప, కర్నూలు, అనంతపురం జిల్లా ల నుండి సభ్యులు హాజరయ్యారు.ఈ సమావేశం లో అధ్యక్షులు వరద రాజులు మాట్లాడుతు కేటరింగ్ రంగాన్ని పరిశ్రమ గా గుర్తించాలి అని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జీ.ఎస్.టి మరియు ఫుడ్ సేఫ్టీ పై సభ్యులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని,ఆయా జిల్లాలకు త్వరలో కమిటీ లు వేస్తామని,ఈ కరొణ సమయం లో చిన్న తరహా క్యాటరరస్ చాలా ఇబ్బందులు పడుతున్నారు అని ప్రభుత్వం వారిని ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమం లో రవి కుమార్ జనరల్ సెక్రటరీ,రమేష్ బాబు ట్రసరార్, విజయ్ కుమార్ జనరల్ సెక్రటరీ అడ్మినిస్ట్రేషన్ మరియు ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## వాడపల్లి అభివృద్ధికి సహాయ సహకారాలు అందిస్తా మంత్రి వెల్లంపల్లి



రాజమండ్రి తూర్పుగోదావరి జిల్లా కోనసీమ తిరు పతి వాడపల్లి వెంకటేశ్వర స్వామి ఆలయానికి తన సహాయ సహకారా లు అందజేస్తామనిరాష్ట్రదేవాదాయధర్మాదాయ శాఖ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాస్ అన్నారు.కొత్తపేట నియోజక వర్గంలో పర్యటన భాగంగా ఆయన ప్రభుత్వ విప్ కొత్తపేట శాసనసభ్యు లు చిర్ల జగ్గిరెడ్డితో కలిసి వాడపల్లి వెంకటేశ్వర స్వామి వారిని దర్శించు కున్నారు.ఈసందర్భంగా ఆయనకు ఆలయ కమిటీ చైర్మన్ రుద్రరాజు రమేష్ రాజు ఆలయ కార్యనిర్వహణా ధికారి యమ్ సత్యనారాయణ రాజు ఆలయ మర్యాదలతో పూర్ణకుంభ స్వాగతం పలికారు.అనంతరం స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో సుమారు 8కోట్ల రూపాయలు వెచ్చించి నిర్మాణం జరుగుతున్న అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరుమల తిరు పతి వెంకటేశ్వర స్వామి ఆలయం తరువాత అంద అభివృద్ధి జరుగుతు న్న ఆలయం వాడపల్లి వెంకటేశ్వర స్వామి ఆలయం అని వాడపల్లి అభి వృద్ధికి తమ శాఖ ద్వారా సహాయ సహకారాలు అందజేస్థానని తెలిపా రు.అనంతరం స్వామి వారి అన్న ప్రసాదం స్వీకరించారు.

## తెరపైకి 50-50 ఫార్ములా

విజయవాడ, జనవరి 10, (న్యూస్ పల్స్) జనసేన పార్టీతో తెలుగుదేశం పార్టీ మానసికంగా పొత్తుకు సిద్ధమయింది. జనసేనతో పొత్తు లేకుండా పోటీ చేయడం కష్టమేనన్న అభిప్రాయం అధినేత చంద్రబాబు నుంచి కిందిస్థాయి నేతల నుంచి వ్యక్తమవుతుంది. ఇది జనసేన పార్టీకి అడ్వాంటేజీగా మారుతుంది. తాము బీజేపీతో ప్రస్తుతం మిత్రపక్షంగా ఉన్నామని, పొత్తు ఆలోచన లేదని జనసేన నేతలు చెబుతున్నారు. కానీ అవి బయట మాటలే. లోలోపల మాత్రం జనసేన కూడా టీడీపీతో పొత్తుకు రెడీ అయిపోతుందంటున్నారు. తెలుగుదేశం పార్టీ జనసేన పార్టీకి జిల్లాకు నాలుగు స్థానాలు ఇవ్వాలని భావిస్తుంది. మొత్తం 13 జిల్లాల్లో జనసేనకు 52 స్థానాలు ఇచ్చేందుకు చంద్రబాబు రెడీ అయిపోయినట్లు వార్తలు వస్తున్నాయి. బలంలేని జిల్లాల్లో సీట్లు తగ్గించుకుని బలం ఉన్న జిల్లాల్లో సీట్లు పెంచుకునేందుకు వీలు కూడా ఉందట. ప్రస్తుతం సోషల్ మీడియాలో ఇదే రకమైన వార్తలు హల్ చల్ చేస్తున్నాయి. కడప వంటి జిల్లాలో స్థానాలను తగ్గించుకుని తూర్పు గోదావరి జిల్లాలో ఎక్కువ స్థానాలను జనసేన తీసుకునే వీలుంది. కానీ జనసేన మాత్రం జిల్లాకు ఆరు స్థానాలను కోరే అవకాశముంది. అయితే ఇప్పుడు కొత్తగా ముఖ్యమంత్రి పదవి ఎవరికి అన్నది కూడా తేల్చాల్సి ఉందట. జనసేన, టీడీపీ కాంబినేషన్ వర్క్ అవుట్ అయితే ఫిఫ్టీ ఫార్ములాను అప్లయి చేయాలని జనసేన అగ్రనేతలు భావిస్తున్నారు. తొలి లేదా చివర రెండున్నరేళ్లు జనసేనకు ముఖ్యమంత్రి పదవి ఇవ్వాలన్న షరతు విధించాలన్న యోచనలో కూడా ఉన్నారు. ఎన్నికల ఫలితాలకు ముందే ఈ ఒప్పందానికి వస్తేనే పొత్తు చర్చలకు వీలవుతుందన్న సంకేతాలను పంపాలన్న భావనలో ఉన్నారు. పొత్తు పెట్టుకుని కేవలం చంద్రబాబుకు ముఖ్యమంత్రి అవకాశం ఇవ్వడం ఎందుకన్న ఆలోచనలలో పవన్ కల్యాణ్ కూడా ఉన్నట్లు చెబుతున్నారు. కర్ణాటకలో 36 స్థానాలు వచ్చిన జేడీఎస్ కు గతంలో కాంగ్రెస్ ముఖ్యమంత్రి పదవి ఇచ్చిన విషయాన్ని జనసేన నేతలు గుర్తు చేస్తున్నారు. వైసీపీని ఓడించాలంటే ముఖ్యమంత్రి ఫిఫ్టీ ఫిఫ్టీ ఫార్ములాకు చంద్రబాబు అంగీకరించాల్సిందేనంటున్నారు. ఆ విషయంలో స్పష్టత ఇస్తేనే పొత్తు చర్చలు ముందుకు సాగుతాయట. సీట్ల సంఖ్య తమకు ముఖ్యంకాదని, తమ అధినేత ముఖ్యమంత్రి కావడమే తమ లక్ష్యమని జనసేన నేతలు చెబుతున్నారు.

## ఈబీసీకి నేస్తానికి ..గుడ్ బై....?

నెల్లూరు, జనవరి 10, (న్యూస్ పల్స్) మాట తప్పను.. మడమ తిప్పను... ఇది ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఎన్నికల ప్రచారంలో ప్రధాన నినాదం. ఇచ్చిన హామీలన్ని నెరవేర్చితీరుతానని చెప్పారు. కాని ఇప్పుడు సీఎంగా మడమ తిప్పడమే ఆయన ముఖ్య నినాదంగా మారిపోయిందనే విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికే చాలా హామీలకు ఆయన మంగళం పాడేశారు. మద్యపాన నిషేదం హామీని గంగలో కలిపి... జనాలను మద్యం తాగించడమే లక్ష్యంగా ఆయన పాలన సాగుతోంది. ఎంతో ప్రతిష్టాత్మకంగా చెప్పుకునే అమ్మఒడికి 2021–21 సంవత్సరానికి గాని ఎగనామం పెట్టేశారు. తాజాగా ఈబీసీ నేస్తం పథకానికి హ్యాండిచ్చేశారు జగన్ రెడ్డి. ఈబీసీ పథకం కింద లబ్దిదారుల ఖాతాల్లో జనవరి 10న నిధులు జమ చేయాల్సి ఉంది. ఇందుకోసం నంద్యాలలో భారీ సభకూ ఏర్పాట్లు చేశారు. కాని చేతిలో కాసులు లేకపోవడంతో ఆపేశారు. నిధుల కోసం ఆర్థికమంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి అధికారులను తీసుకుని ఢిల్లీకి వెళ్లారు. అప్పుకోసం కేంద్రాన్ని విన్నవించుకుంటున్నారు. కేంద్రం కరుణిస్తే మంగళవారం నిధులు లేదంటే ఈబీసీ నేస్తం లేనట్టేనని అధికారులు చెబుతున్నారు.ఈబీసీ నేస్తం' పథకంలో భాగంగా ఆర్థికంగా వెనుకబడిన 45 సంవత్సరాలు దాటిన ఓసీ మహిళలకు ఏటా రూ.15వేలు అందించాలని నిర్ణయించారు. ఈ పథకానికి రూ.600 కోట్ల నుంచి రూ.650 కోట్లు ఖర్చవుతాయని అంచనా వేశారు. గత సోమవారం సీఎం జగన్ ప్రధాని మోడీ, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ని కలిసి అప్పుల అనుమతి కోసం విజ్ఞప్తి చేసుకోగా రాత్రికి రాత్రే రూ.2500 కోట్ల అప్పు పుట్టింది. వచ్చింది వచ్చినట్లుగా ఆ మొత్తాన్ని ఒక్కరోజులోనే ఖర్చు పెట్టేశారు. అయినా అప్పులు ఈజీగా పుడతాయని, కర్నూలు జిల్లాలోని నంద్యాలలో భారీ సభను ఏర్పాటు చేశారు. కానీ ప్రభుత్వం అనుకున్నట్లుగా కొత్త అప్పు పుట్టలేదు. ప్రస్తుతం ప్రభుత్వం చేతిలో చిల్లిగవ్వ కూడా లేకపోవడంతో, అనుకున్న సమయానికి అప్పు కూడా అందకపోవడంతో ఈబీసీ నేస్తం పథకాన్ని వాయిదా వేయాలని నిర్ణయించారు.కొత్త అప్పులకు అనుమతిచ్చిన వారానికే మళ్లీ మరింత అప్పు కోసం ఢిల్లీ యాత్రలు మొదలుపెట్టారు ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి. ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రావత్, ఆర్థిక శాఖ సెక్రటరీ సత్యనారాయణతో కలిసి ఆయన ఢిల్లీ వెళ్లారు. సోమవారం కేంద్ర ఆర్థిక శాఖ అధికారులను కలిసి అప్పుల కోసం విన్నపాలు చేసుకోనున్నారు. కేంద్రం కరుణించి అనుమతిస్తే మంగళవారం ఆర్‌బీఐ నిర్వహించే సెక్యూరిటీల వేలంలో పాల్గొని రుణం తెచ్చుకుంటారు.

# రైళ్లను ఆపాలని కోరుతూ రైల్ రోకో

కడప కడప జిల్లాలోని కొన్ని రైల్వే స్టేషన్లలో రైళ్లను ఆపాలని వైకాపా నేతలు రైలు రోకో కార్యక్రమం నిర్వహించారు. స్థానిక పార్టీ కార్యాలయం నుంచి రేల్వే గేటు వరకు ర్యాలీని నిర్వహించారు. రైల్వే గేటు పట్టాలపై నాయకులు కార్యకర్తలు బైఠాయించారు. కమలాపురం ఎమ్మెల్యే పి రవీంద్ర నాథ్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలోని కొన్ని స్టేషన్ లలో రైలు ఆపాలని కోరుతూ రైల్వే స్టేషన్ మాస్టర్ లకు రైల్వే ఉన్నతాధికారులకు ఎంత విన్నవించిన ప్రయోజనం లేదని అన్నారు. సౌత్ ఇండి యా పై బిజెపి ప్రభుత్వం సవతి ప్రేమ చూపిస్తోంది. కరోనా పేరుతో రద్దు చేసిన రైళ్ల స్టాపింగ్ ను తిరిగి పునరుద్ధరించాలి. కడప జిల్లాలోని కమలాపురం, నందలూరు, రాజంపేట రైల్వే స్టేషన్లలో అన్ని రైళ్ళను నిలపాలి. అధికారులకు అనేకసార్లు విన్నవించినా పట్టించుకున్న పాపాన పోలేదు. నష్టాల పేరుతో రైళ్లను ఆపకుండా బిజెపి నాటకం ఆడుతోందని అన్నారు. రైల్వే ఉన్నతాధికారులు స్పందించి హామీ ఇచ్చేంతవరకు విరమింపచేయమని అన్నారు. ఈ రైల్ రోకో లో మైదుకూరు ఎమ్మెల్యే రఘురామిరెడ్డి, ఆర్టీసీ చైర్మన్ దుగ్గాయపల్లె మల్లికార్జున రెడ్డి. జిల్లా వ్యవసాయ శాఖ సలహామండలి చైర్మన్ సంబటూరు ప్రసాద్ రెడ్డి తదితరులు పాల్గోన్నారు.

# విజయనగరంలో రాక్ పార్క్

విజయనగరం, జనవరి 10, (న్యూస్ పల్స్) విజయనగరం కార్పొరేషన్ పరిధిలో అభివృద్ధిచేసిన రాక్ గార్డెన్‌కు ప్రత్యేక స్థానం ఉంది. తెలంగాణ రాష్ట్రంలో ఇటువంటి పార్కు ఉండగా.. ఆంధ్రాలో ఇదే మొట్టమొదటిది కావడం విశేషం. అమృత్ పథకం నిధులతో ఈ పార్కును నిర్మించారు. నగరంలోని ఐదున్నర ఎకరాల సువిశాల స్థలంలో అభివృద్ధి చేసిన రాక్‌గార్డెన్ అరుదైన ఔషధ మొక్కలతో ఆహ్లాదకర వాతావరణాన్ని అందించేందుకు సిద్ధమైంది. గార్డెన్ ఆవరణలో దేశ, విదేశాలకు చెందిన 118 రకాల జాతుల మొక్కలను నాటారు. వీటన్నింటినీ హైదరాబాద్ నుంచి తెప్పించారు. రాక్ గార్డెన్ విద్యార్థులకు ఉపయుక్తం. గార్డెన్‌లో వివిధ రకాల ఔషధ మొక్కలతో పాటు బొటానికల్ మొక్కలు ఉన్నాయి. సైన్స్ విద్యార్థులు ప్రత్యక్షంగా మొక్కలను పరిశీలించేందుకు అవకాశం కలుగుతుంది. వాటి శాస్త్రీయ నామాలను పార్క్ నిర్వహణ సిబ్బందిని అడిగి తెలుసుకోవచ్చు. రాష్ట్రంలోనే తొలి బొటానికల్ గార్డెన్ విజయనగరంలో రూపుదిద్దుకోవడం ఆనందంగా ఉంది. జనవరి ఒకటో తేదీ నుంచి ప్రజలు సందర్శించి విజ్ఞానం పెంచుకోవాలి.

# రోడ్డు ప్రమాదంలో 8 మంది కూలీలకు గాయాలు

గిద్దలూరు ప్రకాశం జిల్లా గిద్దలూరు పట్టణంలోని వివేకానంద కాలనీ సమీపంలోని అమరావతి అనంతపురం జాతీయ రహదారి పై కారు, బొలెరో వాహనం ఢీకొన్న సంఘటన చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో బొలెరో వాహనంలో ప్రయాణిస్తున్న ఎనిమిది మంది గాయాలపాలయ్యారు. హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకున్న పెట్రోలింగ్ పోలీసులు 108 వాహనంలో గాయపడ్డ వారిని గిద్దలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి వైద్యం అందించారు.గాయపడిన వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉ ండడంతో వైద్యులు వారిని మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదం చోటు చేసుకున్న సమయంలో బొలెరో వాహనంలో మొత్తం 18 మంది ప్రయాణిస్తున్నారు. వీరందరూ కర్నూలు జిల్లా డోన్ నుంచి గుంటూరు కు మిరపకాయ కోతలకు వెళ్తున్న వలస కూలీలు గా పోలీసులు గుర్తించారు.జరిగిన సంఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ జరుపుతున్నారు.

## మదరసా రిలే నిరాహార దీక్షలు చివరి రోజు

నంద్యాల నంద్యాల పట్టణంలో మదరసా వారు నిర్వహించిన నిరహరదీక్షలు సోమవారం నాడు చివరి రోజు కావడంతో సీనియర్ నాయకుడుఏవిసుబ్బారెడ్డితనఅనుచరులతోసిటికేబుల్ కార్యాలయం నుంచి ర్యాలీగా వెళ్లి ముస్తాక్ అహమ్మద్ ఆధ్వర్యంలో జరుగుతున్న నిరహర దీక్ష శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో యస్ బాబుల్లా తదితరులు పాల్గొన్నారు.

## ఆసుపత్రి ఆవరణలో ఆక్సిజన్ జనరేషన్ ప్రారంభం

నంద్యాల నంద్యాల జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో ఏర్పాటు చేసిన 500 ఎల్‌పీఎం సామర్థ్యం కలిగిన ఆక్సిజన్ జనరేషన్ ప్లాంట్ (జగనన్న ప్రాణవాయువు) ను వర్చువల్ విధానం ( వీడియో కాన్ఫరెన్సు) ద్వారా ప్రారంభించిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి. జగనన్న ప్రాణవాయువు (పి ఎస్ ఏ ప్లాంట్) ప్రారంభ కార్యక్రమంలో లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వర రావు , నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానంద రెడ్డి , ఎమ్మెల్సీ ఇసాక్ బాషా , నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి , జాయింట్ కలెక్టర్ (అభివృద్ధి) డా.మనజీర్ జిలానీ సమూన్ , నంద్యాల సబ్ కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ , మార్క్ ఫెడ్ చైర్మన్ పి.పి నాగిరెడ్డి , నంద్యాల జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ విజయ్ కుమార్, ఏపీఎంఎస్ ఐడిసి ఈఈ సదాశివ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# ఉచిత సర్వదర్శనం టోకన్ల పంపిణీ

తిరుమల తిరుమల శ్రీవారి వైకుంఠ ద్వార దర్శనానికి తిరుపతిలో ఉ చిత సర్వదర్శనం టోకన్లు ను సోమవారం నుంచి కౌంటర్ల ద్వారా ఇస్తున్నారు. 13వ తేదీ నుంచి 22వ తేదీ వరకు రోజుకు ఐదు వేల చొప్పున మొత్తం 50 వేల టోకన్లు ఇవ్వడానికి టీటీడీ నిర్ణయించారు. ఇందులో భాగంగా తిరుపతి లో ఐదు చోట్ల కౌంటర్ను ఏర్పాటు చేసి ఉచిత టోకెన్లను పంపిణీ చేస్తోంది. తెల్లవారుజామున కౌంటర్లో వద్దకు పెద్ద ఎత్తున తిరుపతి వాసులు చేరుకొని క్యూలైన్లలో నిల్చున్నారు కేవలం తిరుపతి కి సంబంధించిన వారికి ఇక్కడ తనకి వైకుంఠద్వార దర్శనానికి టికెట్లు ఇస్తారని అధికారులు తెలిపారు.

# నల్లమలలో 65 పెద్ద పులులు, 75కిపైగా చిరుతలు

ఒంగోలు, జనవరి 10, (న్యూస్ పల్స్) పులి పంజా విసిరితే ఎలాంటి వన్యప్రాణి అయినా దానికి ఆహారం కావాల్సిందే. అయితే, ఆహారం కోసం వేటాడుతూ అరణ్యం దాటి బయటకొస్తున్న పులులు ప్రమాదాల బారినపడి మృత్యు వాతపడుతున్నాయి. నల్లమల అటవీ ప్రాంతంలో పులుల సంరక్షణకు అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నప్పటికీ తరచూ పులులు మృతి చెందడం ఆందోళన కలిగిస్తోంది. ఒక వైపు పులుల సంతతి పెంచేందుకు చర్యలు తీసుకుంటుంటే.. మరో వైపు వేటాడే నేపథ్యంలో అవి ప్రాణాలు కోల్పోతున్నాయి. దీంతో పులుల సంరక్షణపై అటవీశాఖ అధికారులు మరింత దృష్టి సారించారునల్లమల అటవీ ప్రాంతంలో వరుసగా పులులు మృతి చెందడం ఆందోళన కలిగిస్తోంది. వాటి సంరక్షణపై పూర్తిస్థాయిలో దృష్టి సారించినట్లు అటవీశాఖ అధికారులు చెబుతున్నప్పటికీ.. గడిచిన రెండేళ్లలో రెండు చిరుతలు, రెండు పెద్ద పులులు మృతి చెందాయి. ప్రధానంగా వేటాడే క్రమంలో ప్రమాదాలకు గురై మృతి చెందుతున్నాయి. నల్లమల అభయారణ్యాన్ని కేంద్ర అటవీ మంత్రిత్వ శాఖ టైగర్ రిజర్వు ఫారెస్ట్ (రాజీవ్ అభయారణ్యం)గా ప్రకటించింది. దోర్నాల?శ్రీశైలం, శ్రీశైలం?తెలంగాణ రాష్ట్రంలోని అమ్రాబాద్ పరిధిలో రాత్రి 10 నుంచి ఉదయం 5 గంటల వరకు పులుల సంచారం ఉన్నందున అటవీశాఖ గేట్లను ఏర్పాటు చేసి రహదారులపై రాకపోకలను నిలిపివేస్తోంది. వేటగాళ్ల నుంచి పులులను కాపాడేందుకు నల్లమలలో 24 బేస్ క్యాంపులు ఏర్పాటు చేశారు. మొత్తం 120 మంది టైగర్ ట్రాకర్లు పనిచేస్తున్నారు. ఒక్కో బేస్ క్యాంప్‌లో ఐదుగురు సభ్యులు ఉంటారు. వీరు కాకుండా స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్ సిబ్బంది అడవిలో తిరుగుతుంటారు.జంతువులను వేటాడుతూ అడవిలో నుంచి రోడ్లపైకి, రైల్వేట్రాక్‌లపైకి వచ్చిన సమయంలో ప్రమాదవశాత్తూ వాహనాలు ఢీకొని పులులు మృతిచెందుతున్నాయి. వేసవిలో మంచినీటి కోసం జనారణ్యంలోకి వెళ్లే క్రమంలోనూ రోడ్లు దాటుతూ ప్రమాదాలకు గురవుతున్నాయి. అదే సమయంలో పొలాల్లో అడవి పందుల కోసం వేసిన ఉచ్చులు, విద్యుత్ సరఫరాతో కూడిన కంచెల్లో చిక్కుకుని కూడా పులులు మృతిచెందే ప్రమాదం ఉంది. వేటాడే క్రమంలో అడవిలోని బావుల్లో పడి నీటిలో నుంచి బయటప డలేక కూడా తాజాగా చిరుత మృతిచెందింది. మన రాష్ట్రంలోని ప్రకాశం, గుంటూరు, కర్నూలు, తెలంగాణ రాష్ట్రంలోని మహబూ బ్‌నగర్ జిల్లాల్లో 3,568 చదరపు కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్న నల్లమల అటవీ ప్రాంతంలో 65 పెద్ద పులులు, 75కిపైగా చిరుతలు ఉన్నాయి. వాటిలో మార్కాపురం డివిజన్ అటవీ ప్రాంతం దాదాపు 900 కిలోమీటర్ల పరిధిలో ఉంది. ఇటీవల పులుల గణనను ప్రారంభించారు. వాటి కాలి గుర్తులు, ట్రాక్ చేసిన సీసీ కెమేరాల ద్వారా దాదాపు 65 పులులు ఉన్నట్లు గుర్తించారు. అందులో దాదాపు 5 పులులు తెలంగాణ అడవిలో కూడా సంచరిస్తున్నట్లు భావిస్తున్నారు. మార్కాపురం డీఎఫ్‌వో పరిధిలో శ్రీశైలం, నంద్యాల, గుంటూరు జిల్లా మాచర్ల, విజయపురిసౌత్ ప్రాంతాల్లో నల్లమల అటవీ ప్రాంతం విస్తరించి ఉంది. ప్రతి నాలుగేళ్లకు ఒకసారి పులుల సంఖ్యను అధికారికంగా లెక్కిస్తారు. దానిలో భాగంగా నాలుగేళ్ల క్రితం నల్లమలలో 40 నుంచి 48 పెద్ద పులులు ఉండగా, ప్రస్తుతం ఆ సంఖ్య 65కి చేరింది.

ఇక చిరుత పులులు 75కిపైగా ఉన్నాయి. వాటితో పాటు అరుదైన అలుగు, వేల సంఖ్యలో జింకలు, దుప్పులు, నెమళ్లు, రేచుకుక్కలు, ముళ్ల పంది, ఈలుగ, ఎలుగుబంట్లు ఉన్నాయి.నల్లమలలో పులుల సంరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. పులులతో పాటు ఇతర జంతువులకు తాగునీటి సమస్య లేకుండా చాలా ప్రాంతాల్లో సాసర్ పిట్లు ఏర్పాటుచేసి నీటి వసతి కల్పించాం. పులులు సంచరించే ప్రాంతాల్లో కెమేరాలు బిగించాం. బేస్‌క్యాంప్ సిబ్బంది 24 గంటల పాటు పులుల సంరక్షణపై దృష్టి పెడతారు. అడవుల్లోకి ఎవరొచ్చినామాకుతెలిసేవిధంగాఏర్పాట్లు చేసుకున్నాం. నిబంధనలు అతిక్రమించి జంతువులపై దాడులకు పాల్పడితే నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేస్తాం. నల్లమలలో మరో బేస్ క్యాంప్ ఏర్పాటుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. గిద్దలూరు? నంద్యాల మధ్య ఉన్న రైల్వే ట్రాక్ ప్రాంతాల్లో కొన్ని చోట్ల రైళ్ల వేగం తగ్గించాలని ప్రతిపాదనలు పంపారు. దీంతో పాటు అండర్ పాస్ బ్రిడ్జిలు ఏర్పాటు చేయాలని ఉన్నాతాధికారులకు తెలిపారు. అటవీ ప్రాంతం లో నీటి కొరత లేకుండా చేశాం. కృష్ణా రివర్ ప్రాంతంలో పులుల సంచారం ఎక్కువగా ఉన్నందున గట్టి భద్రతా చర్యలు తీసుకున్నాం.

# జిల్లాల్లో సై అంటున్న పందెం కోళ్లు



ఏలూరు, జనవరి 10, (న్యూస్ పల్స్ సంక్రాంతి పండుగంటేనే కోళ్ల పందేలకు ఫేమస్.. ఎంతో హుషారుగా కాయ్‌రాజాకాయ్ అంటూ యువతతో పాటు స్థానిక ప్రముఖులు కూడా ఈ పందేలలో పాల్గొంటుంటారు. అయితే ఈ కోడి పందేలను గతంలో సుప్రీంకోర్టు పూర్తిగా నిషేధించింది. ఆ తరువాత 2018 జనవరిలో కత్తులు, బ్లేడ్లు ఉ పయోగించకుండా, జూదం లేకుండా, ఈ పద్ధతిని సాంప్రదాయ పద్ధతిలో నిర్వహించడానికి అత్యున్నత న్యాయస్థానం అనుమతించింది. అయితే కృష్ణా, గుంటూరు, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి జిల్లాలు ఈ కోడి పందేలకు ఎక్కువగా ఆతిథ్యమిస్తుంటాయి. అయితే ఈ కోళ్ల పందేలలో అన్ని కోడిపుంజులను బరిలోకి దించరు. కోళ్లలో కూడా పందెంకోళ్లు ప్రత్యేకంగా ఉంటాయి. వాటి గురించి చాలామందికి తెలియదు.. పందెనికి వాడే పందెం కోళ్ల గురించి తెలుసుకుందాం..కాకి ? నల్లని ఈకలు గల కోడి పుంజు, నెమలి ? రెక్కలపై, లేక వీపు పై పసుపు రంగు ఈకలు గల కోడి పుంజు, పర్ల ? మెడపై నలుపు, తెలుపు ఈకలు సమానంగా గల కోడి పుంజు, సేతు ? తెల్లని ఈకలు గల కోడి పుంజు, కొక్కిరాయి (కోడి) ? నల్లటి శరీరం, 2, 3 రంగుల ఈకలు గల కోడి పుంజు, సవల ? మెడపై నల్లని ఈకలు గల కోడి పుంజు, డేగ ? ఎర్రటి ఈకలు గల కోడి పుంజు, కౌజు ? నలుపు, ఎరుపు, పసుపు ఈకలు గల కోడి పుంజు, పూల ? ఒక్కొక్క ఈకపై నలుపు, తెలుపు, ఎరుపు రంగులు గల కోడిపుంజు, మైల ? ఎరుపు, బూడిద రంగుల ఈకలు గల కోడి పుంజు, అబ్రాసు ? లేత బంగారు రంగు ఈకలు గల పుంజు.పింగళ ? తెలుపు రెక్కల పై అక్కడక్కడా నలుపు రంగు, లేత గోధుమ రంగు ఈకలు గల కోడి పుంజు, గేరువా ? తెలుపు, లేత ఎరుపు ఈకలు గల పుంజు, ముంగిస ? ముంగిస జూలు రంగు గల పుంజు రకాలు ఉండగా. వీటితో పాటు తక్కువగా లభించే రకాలు.. తెలుపు గౌడు (నలుపు, తెలుపు ఈకలు గల కోడి పుంజు), కాకి నెమలి, కోడి నెమలి, పచ్చ కాకి, ఎరుపు గౌడు (నలుపు, ఎరుపు ఈకలు గల కోడి పుంజు), నల్ల మచ్చల సేతు (తెల్లని ఈకలపై నల్ల మచ్చలు గల కోడి పుంజు), నల్ల సవల (రెక్కల పై నల్ల మచ్చలు గల కోడిపుంజు). అయితే ఈ కోడి పుంజులలో పచ్చకాకి, కాకి, డేగ, కాకి నెమలి రకాలు ప్రత్యేకమైనవేకాకుండా ఖరీదులోనూ అగ్రస్థానంలో ఉంటాయి.

# కబడ్డీ విజయవంతానికి సహకరించిన అందరికి ధన్యవాదాలు


తిరుపతి జనవరి 10, (న్యూస్ పల్స్ తిరుపతి మునిసిపాలిటీ ఆధ్వర్యంలో ఐదు రోజులపాటు జాతీయస్థాయి కబడ్డీ పోటీలను దిగ్విజయంగా నిర్వహించేందుకు సహకరించిన ప్రతి ఒక్కరికీ ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి అన్నారు . తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామీణ , ప్రాచీన క్రీడ కబడ్డీని అఖిల భారత ఆహ్వాన పద్ధతి లో విజయవంతం గా ముగించామన్నారు. రాష్ట్ర పురపాలేక శాఖా మంత్రి బొత్స సత్యనారాయణ, ఉప ముఖ్యమంత్రి నారాయణ స్వామి తిరుపతిని క్రీడా క్షేత్రంగా తీర్చిదిద్దడంలో నగరపాలక సంస్థ జాతీయస్థాయి కబడ్డీ గోల్డ్ కప్ పోటీలు నిర్వహించి, రాష్ట్రంలో నే మార్గదర్శకంగా నిలిచిందన్నారు. ఈ క్రీడల స్ఫూర్తిగా తీసుకుని రాష్ట్రంలోని పురపాలక, నగరపాలక సంస్థ కార్యాలయ ప్రాంతాల్లో ఆదరణ ఉన్న క్రీడలను ప్రోత్సహించాలని ఉత్తర్వులు జారీ చేస్తామని ప్రకటించడం ముదావహమన్నారు. ఏ స్థాయి క్రీడలునిర్వహించినా టిటిడి ప్రోత్సహించడంలో ముందుంటుందని చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి ప్రకటించడం గర్వకారణం అన్నారు. అంతర్జాతీయ క్రీడాకారులు, ద్రోణాచార్య, అర్జున అవార్డు గ్రహీతలు పుల్లెల గోపీచంద్, హోసన్న గౌడ్, రాజరత్నం, కరణం మల్లీశ్వరి లు అంతర్జాతీయ పోటీలు తలపించేలా ఏర్పాట్లు చేయడం పట్ల నిర్వాహకులకు అభినందనలు తెలిపారాణి కరుణాకర్ రెడ్డి వివరించారు. ఇంత పెద్ద ఎత్తున పోటీలకు సహకరించిన పుర ప్రజలు, వ్యాపార సంఘాలు, ఆసుపత్రుల యాజమాన్యాలు, వివిధ క్రీడా ఔత్సాహిక సంఘాలు, స్వచ్ఛంద సేవా సంస్థలు, విద్యా సంస్థలు యాజమాన్యాలకు అభినందనలు తెలిపారు.

**ఎమ్మెల్యే భూమన**

**కోవిడ్ నిబంధనలు చక్కగా పాటించాం - మేయర్, కమిషనర్**

కోవిడ్ నిబంధనలు పాటించాం - మేయర్అఖిల భారత ఆహ్వాన కబడ్డీ టోర్నమెంట్ నిర్వహణలో కోవిడ్ నిబంధనలు పాటించామని నగరపాలక సంస్థ మేయర్ డాక్టర్ శిరీషా అన్నారు. జాతీయ క్రీడాకారులకు వసతి సదుపాయం కల్పించిన టిటిడి శ్రీనివాసం, మాధవంలో రోజువారీ సానిటైజేషన్ చేయించామన్నారు. క్రీడాకారులకు మాస్కులు, సానీటైజర్లు నగరపాలక సంస్థ చే సరఫరా చేశామన్నారు. త్రాగునీరు కూడా ప్రత్యేకంగా బాటిల్స్ క్రీడామైద్దానంలో ఏర్పాటు చేశామన్నారు. నగరంలో వ్యక్తిగత భద్రత తప్పనిసరి– కమిషనర్‌నగర ప్రజలు వ్యక్తిగతంగా పరిశుభ్రంగా ఉండాల్సిన అవసరం ఉందని కమిషనర్ గిరీషా ప్రజలను విజ్ఞప్తి చేశారు. జాతీయస్థాయి కబడ్డీ పోటీల్లో కూడా క్రీడాకారులకు, సహచరులకు అందరికి కూడా పరిక్షలు నిర్వహించామన్నారు. కోవిడ్ నిబంధనలు పాటించామన్నారు. మూడవ వేవ్ రానున్న నేపథ్యంలో నగర ప్రజలు మాస్కులు ధరించాలని, చేతులను ఎప్పటికప్పుడు శుభ్రపరుచుకోవాలన్నారు. వైరస్ వ్యాప్తిని అరికట్టేందుకు ప్రతి ఒక్కరు బాధ్యతగా వ్యవహరించాలన్నారు. ఈ విలేకరుల సమావేశంలో డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణ పాల్గొన్నారు.

# కరోనా భయంతో ఆత్మహత్యాయత్నం..తల్లీకొడుకుల మృతి



చెన్నై జనవరి 10 తమిళనాడు మదురైలో కరోనా మహమ్మారికి భయ పడి ఒకే కుటుంబానికి చెందిన నలుగురు విషం తాగి ఆత్మహత్యా యత్నా నికి పాల్పడగా ఇద్దరు మృతి చెందారు. మరో ఇద్దరు తీవ్ర అసస్వస్థతకు గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. మదురై కల్‌మేడు ఎంజీఆర్ నగర్‌లో నాగరాజన్, లక్ష్మి (46) అనే భార్యాభర్తలు నివసిస్తున్నారు. వీరికి అనితా, జ్యోతిక (23) అనే కుమార్తెలు శిబిరాజ్ (13) అనే కుమారుడు ఉన్నారు. కొన్ని నెలల క్రితం అనితా ఆకస్మికంగా మృతి చెందగా. జ్యోతికకు వివాహమై భర్తతో ఉంటోంది. ఈ నేపథ్యంలో నాగరాజన్ హఠాత్తుగా తీవ్ర అస్వస్థతకు గురికావటంతో తల్లిదండ్రుల సేవ చేసేందుకు జ్యోతిక తన మూడేళ్ల కుమారుడు రితీష్‌తో పుట్టింటికి వచ్చింది. కొద్ది రోజులకు నాగరాజన్ మృతి చెందాడు. నెలల తేడాలో కుమార్తెను, భర్తను పోగొ ట్టుకుని శోకంతో లక్ష్మి క్రుంగిపోయింది. ఈ నేపథ్యంలో జ్యోతికకు జలుబు, దగ్గు అధికమై ఆర్టీపీసీఆర్ పరీక్షలు చేయించగా ఆమెకు కరోనా సోకినట్లు నిర్ధారణ అయ్యింది. ఈ సంగతి తెలిసి లక్ష్మి మరింత దిగులు చెంది ఇంటిలో ఒకరికి కరోనా సోకింతే అందరికీ వ్యాపిస్తుందని భయపడింది. జ్యోతిక కూడా మరింత క్రుంగిపోయి కరోనాతో ఇబ్బంది పడటం కంటే చావటం మేలనుకుంది.

## వరి కుప్పలకు నిప్పంటించిన దుండగులు

బాపులపాడు కృష్ణాజిల్లా బాపులపాడు మండలం వీరవల్లి గ్రామంలో దారుణం చోటుచేసుకుంది . అరుగాలం పండించి ధాన్యం నిల్వ ఉ ంచిన 6 వరి కుప్పలకు నిప్పంటించిన గుర్తు తెలియని వ్యక్తులు. దాసరి జోజీ అనే కౌలు రైతు కి చెందిన 6 వరి కుప్పులు దగ్ధం అయ్యాయి. జోజీ భార్య దూసరి నిర్మల వీరవల్లి సెగ్మెంట్ -1 వైకాపా ఎంపిటిసి ఉన్నారు. 14 ఎకరాలు కౌలు తీసుకుని వరి పంట సాగు చేశారు. సుమారు 15లక్షల రూపాయలు పెట్టుబడి ఖర్చు చేశామని పూర్తి మంటల్లో కాలిపోయాయిని చెబుతున్నారు. వీరవల్లీ పోలీసు స్టేషన్ సమాచారం అందించటంతో ఎస్ ఐ సుబ్రహ్మణ్యం ప్రమాద స్థలానికి చేరుకుని పరిస్థితి పరిశీలించారు.. రాజకీయంగా , కుటుంబ పరంగా ఎవరితో ఏలాంటి విభేదాలు లేవని జోజి చెబుతున్నారు. బయట నుంచి డబ్బులు తీసుకువచ్చి పెటుబడి పెట్టామని పూర్తిగా కాలిపోవటంతో కన్నీరు పర్యంతమైయ్యారు. వివిధ రాజకీయ పార్టీ నాయకులు , గ్రామస్తులు పెద్ద ఎత్తున స్టేషన్ కి తరలివచ్చి రైతు జోజిని పరామర్శిస్తున్నారు

## అడ్డంగా దోచేస్తున్న ప్రైవేట్ ట్రావెల్స్




గుంటూరు, జనవరి 10, (న్యూస్ పల్స్)సంక్రాంతి పండగ పేరు చెప్పి ప్రయాణికులను నిలవునా దోచుకునేందుకు ప్రైవేట్ ట్రావెల్స్ సిద్ధమయ్యాయి. హైదరాబాద్ నుంచి జిల్లాకు, జిల్లా నుంచి హైదరాబాద్‌కు వచ్చి వెళ్లే టికెట్ ధరలను ఇష్టారాజ్యం పెంచేశాయి. అడ్డగోలుగా ప్రయాణికుల జేబులకు చిల్లు పెడుతున్నాయి. ఇదేమని అడిగే నాథులు కనపడడం లేదు. అధికారయంత్రాంగం కూడా చోద్యం చూస్తోందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సాధారణంగా అయితే గుంటూరు నుంచి హైదరాబాద్‌కు నాన్ ఏసీ బస్సుకు రూ.400, ఏసీ బస్సుకు రూ. 500, స్లీపర్ ఏసీ బస్సుకు రూ.700, హైదరాబాద్ నుంచి గుంటూరుకు నాన్‌ఏసీ రూ.400, ఏసీ రూ.500, స్లీపర్ ఏసీ రూ.800 డిమాండ్‌ను బట్టి కొంచెం అటుఇటుగా చార్జీలు ఉంటాయి. అయితే ఇప్పుడు సంక్రాంతి పేరు చెప్పి ఈ టికెట్ల వెలను ఆయా ప్రైవేట్ ట్రావెల్స్ యాజమాన్యాలు అమాంతం పెంచేశాయి.ఒక్కో టికెట్‌పై అదనంగా రూ.400 నుంచి రూ.1,000 వరకూ దోచుకుంటున్నాయి. ఆయా ట్రావెల్స్ తమ ఆన్‌లైన్ వెబ్‌సైట్‌లలో పెంచిన ధరలను ప్రదర్శిస్తున్నాయి. రాష్ట్రంలోని నలుమూలల నుంచి లక్షల మంది ప్రజలు బతుకుదెరువు నిమిత్తం హైదరాబాద్‌లో నివసిస్తుంటారు. కొందరు స్వగ్రామాల నుంచి వెళ్లి హైదరాబాద్‌లో స్థిరపడిన వారూ ఉంటారు. తెలుగునాట పెద్ద పండుగైన సంక్రాంతికి వీరంతా స్వగ్రామాలకు రావడం సహజం. దీంతో సంక్రాంతి సమయంలో సగం హైదరాబాద్ ఖాళీ అవుతుంది. ఈనేపథ్యంలో ఒక్కసారిగా ప్రజలు సంక్రాంతి సెలవులకు స్వగ్రామాలకు పయనమయ్యే అవకాశాలు ఉండటంతో ట్రావెల్స్ యాజమాన్యాలు దోపిడీకి తెరలేపాయి. అయినా అధికార యంత్రాంగం పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

హైదరాబాద్ నుంచి గుంటూరుకు ధరలు ఇలా (రూపాయల్లో)..

| బస్సు రకం | సాధారణ ధర | పండగ ముందు చార్జి |
|---|---|---|
| నాన్‌ఏసీ | 300?500 | 1,000 |
| నాన్ ఏసీ స్లీపర్ | 600?700 | 1.000 |
| ఏసీ | 540 | 1,200 |
| స్లీపర్ ఏసీ | 700 800 | 1,400/1,500 |

గుంటూరు నుంచి హైదరాబాద్‌కు ధరలు ఇలా(రూపాయల్లో).. .

| బస్సు రకం | సాధారణ ధర | పండగ ముందు చార్జి |
|---|---|---|
| నాన్‌ఏసీ | 400 | 900?1,500 |
| నాన్ ఏసీ స్లీపర్ | 600 | 1000?1,500 |

## సినిమా వాళ్లు బలిసి కొట్టుకుంటున్నారు: నల్లపురెడ్డి

అమరావతి జనవరి 10 సినిమా వాళ్లు బలిసి కొట్టుకుంటున్నారంటూ టాలీవుడ్‌ను ఉద్దేశించి వైసీపీ ఎమ్మెల్యే నల్లపురెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. అసలు సినిమా వారికి ఏపీ అంటే గుర్తుందా? అని ప్రశ్నించారు. టిక్కెట్ రేట్లు తగ్గిస్తే సామాన్యులు కూడా సినిమాలు చూస్తారని, ప్రభుత్వ నిర్ణయంలో తప్పేంటని ఆయన సమర్థించుకున్నారు. కాగా మంత్రి పేర్ని నాని, దర్శకుడు రామ్ గోపాల్ వర్మ భేటీ సమయంలో నల్లపురెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు దుమారం రేపుతున్నాయి.నల్లపురెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి తరచుగా ఎవరో ఒకరిపై ఆరోపణలు చేయడం ఆయనకు అలవాటు.. సోమవారం కోవూరులో పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవానికి వచ్చినప్పుడు సినిమా వాళ్ల గురించి మాట్లాడారు. సినిమా వాళ్లంతా హైదరాబాద్‌లో ఉన్నారని, వారికి ఏపీ కనిపిస్తుందా? అని ప్రశ్నించారు. బలిసి కొట్టుకుంటున్నారని వివాదాస్పద వ్యాఖ్యలు చేయడంపై నెల్లూరు జిల్లా వ్యాప్తంగా చర్చలు జరుగుతున్నాయి. కేవలం నల్లపురెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి తన ఇమేజ్ పెంచుకోవడం కోసమే ఇలాంటి వ్యాఖ్యలు చేశారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గతంలో ఐఏఎస్, ఐపీఎస్ అధికారులపై ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే. ఇప్పుడు ఎమ్మెల్యే చేసిన వ్యాఖ్యలపై ప్రధాన హీరోల అభిమానులు తీవ్రస్థాయిలో మండిపడుతున్నారు.

# బైరెడ్డిని విమర్శించే స్థాయి మీకు లేదు..చిన్న సుంకన్న.





నందికొట్కూర్జనవరి 10, (( విభారె) )నందికొట్కూర్ బిజెపి నియోజక ఇంచార్జి కొండేపోగు చిన్న సుంకన్న. ఈ సందర్భంగా సోమవారం నాడు బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి నివాసంలో అభివృద్ధి గురించి చర్చకు సిద్ధమాఅని బిజెపి నాయకులు సవాల్ చేశారు .బిజెపి జిల్లా నాయకులు గూడూరు శివ ప్రసాద్ రెడ్డి, బిజెపి నందికొట్కూరు పట్టణ అధ్యక్షులు గూడూరు రవి కుమార్ రెడ్డి, బీజేవైఎం మండల అధ్యక్షులు శివ, బైరెడ్డి శబరి అమ్మ సైన్యం అధ్యక్షులు నాగన్న, నందికొట్కూర్ బిజెపి మైనార్టీ నాయకులు మల్యాల బషీర్, కిసాన్ మోర్చా నాయకులు అబ్రహాము, బైరెడ్డిని విమర్శించే స్థాయి మీకు లేదు.మీకు అందరికీ రాజకీయ బిక్ష పెట్టింది బైరెడ్డి .ఓఖఖ మీ పేరు ఉరు తెలియని మీకు బైరెడ్డి అశ్రయం ఇచ్చిన విషయం మరిచిపోయి నవా . నందికొట్కూరు ను మా బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అబివృద్ధి చేసినా మొట్టమొదటి వ్యక్తి బైరెడ్డి,మీరు నందికొట్కూరు నియోజకవర్గంలో అభివృద్ధి చేసినారో లేదో మాకు తెలియదు. బహిరంగ చర్చకు సిద్ధమా బిజెపి నాయకులు మల్యాల బషీర్ సవాల్ చేశారు.మల్యాల గ్రామంలో మీరు రస్తా విషయంలో రైతుల ను బెదిరించి వారి పోలాలను బిడు చేసిందినిజం కాదా.రైతులకు న్యాయం జరగాలని మా నాయకుడు బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి ఆదివారం నాడు నిరుపేదలు అయినటువంటి రైతుల వ్యవసాయ భూముల వద్దకు వెళ్లి వారి సాధక బాధలను గుర్తించి. నిరుపేద లైయినటువంటి రైతుల ఆవేదన లను గుర్తిచి .ప్రశాంతంగా ఉన్న గ్రామంలో చీచ్చు పెట్టింది మీరు కాదా అని హెచ్చరించడం జరిగింది. నందికొట్కూరు నియోజకవర్గంలో కొంతమంది స్వార్ధ రాజకీయ ప్రయోజనం కోసం నిరుపేదలు అయినటువంటి నందికొట్కూరు ప్రజానీకానికి అన్యాయం చేయడం జరుగుతుందని ఇప్పటికైనా ప్రజాసంక్షేమం కోసం ముందుకు వెళ్లి ప్రజలకు ప్రభుత్వం నుండి వచ్చే పలు సంక్షేమ పథకాలు వారికి అందే విధంగా చర్యలు చేపట్టాలి.కాని స్వార్ధ రాజకీయం ప్రయోజనం కోసం ప్రజలను మభ్యపెట్టి తప్పుదోవ పట్టించి వారికి అన్యాయం జరిగితే సహించేది లేదని మల్యాల బషీర్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా నాయకులు గూడూరు శివ ప్రసాద్ రెడ్డి, బిజెపి నందికొట్కూరు పట్టణ అధ్యక్షులు గూడూరు రవి కుమార్ రెడ్డి, బీజేవైఎం మండల అధ్యక్షులు శివ, బైరెడ్డి శబరి అమ్మ సైన్యం అధ్యక్షులు నాగన్న, కిసాన్ మోర్చా నాయకులు అబ్రహాము, పాల్గొన్నారు.

# తుగ్గలి మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలి

తుగ్గలి:జనవరి 10, (( విభారె) అధిక వర్షాలతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోని, తుగ్గలి మండలంను కరువు మండలంగా ప్రకటించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం డిమాండ్ చేసింది.సోమవారం రోజున మండల కేంద్రమైన తుగ్గలిలోని స్థానిక తహసిల్దార్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తూ, నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు. అదేవిధంగా రైతులకు పంట నష్టపరిహారాన్ని ప్రకటిస్తూ, బ్యాంకు రుణాలను మాఫీ చేసి కొత్త రుణాలను ఇవ్వాలని వారు తెలియజేశారు. అదేవిధంగా పంట నష్టపోయి



ఆత్మహత్య చేసుకున్న రైతులను వెంటనే ప్రభుత్వం ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం సభ్యులు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో రైతు సంఘం సభ్యులు శ్రీరాములు,ఎల్లప్ప,వెంకట రాముడు రైతులు పాల్గొన్నారు.

# ఈ' తక్కువ క్యాలరీ ఆహారాలు త్వరగా బరువు తగ్గడంలో సహాయపడతాయి...!



ఊబకాయం నేడు అన్ని వయసుల వారికి చాలా సవాలుగా ఉన్న సమస్య. మరోవైపు, జిమ్నాసియంలు, స్థూలకాయాన్ని తగ్గించడానికి టెలివిజన్ నుండి మ్యాగజైన్ల వరకు అవగాహన కార్యక్రమాలు ఉన్నాయి. అయినా ఊబకాయం తగ్గడం లేదు. కఠోర వ్యాయామం చేసే చాలా మంది బరువు తగ్గకపోవడానికి ప్రధాన కారణం డైట్. బరువు తగ్గడానికి అసలు రహస్యం తక్కువ క్యాలరీలు ఉన్న ఆహారాన్ని తీసుకోవడమే అంటున్నారు వైద్యులు. సరైన సమయానికి ఆహారం తీసుకోకపోవడం, ఒకేసారి ఎక్కువగా తినడం, రాత్రిపూట పిజ్జా, బర్గర్ వంటి కొవ్వుతో కూడిన జంక్ ఫుడ్స్ తినడం, శీతల పానీయాలు తాగడం వంటివి బరువు పెరగడానికి కారణాలు.ఈ సమస్యను పరిష్కరించగల తక్కువ కేలరీల ఆహారాలు కూడా ఉన్నాయి. ఫిట్‌నెస్ ఔత్సాహికులందరికీ, మేము మీకు తక్కువ కేలరీల ఆహారాల జాబితాను అందిస్తున్నాము. మీరు బరువు తగ్గాలనుకుంటే దీన్ని ప్రయత్నించండి. ఈ వ్యాసంలో, మీరు బరువు తగ్గడానికి సహాయపడే తక్కువ కేలరీల జాతీయ ఆహారాల గురించి కనుగొంటారు.బరువు తగ్గడానికి కొన్ని భారతీయ ఆహారాలువెన్న, క్వినోవా, సాల్మన్ వంటి అరుదైన ఆహారాలు బరువు తగ్గడంలో మీకు సహాయపడతాయి. ఫిట్‌నెస్ ప్రియులు మరియు బరువు తగ్గడానికి కొత్త ఆహారాలు తీసుకునే వారిలో ఇది బాగా ప్రాచుర్యం పొందింది. బరువు తగ్గడం అంటే మీరు తీసుకునే కేలరీల పరిమాణాన్ని తగ్గించడం కాదు. కానీ మీరు తినే ఆహారం ఆరోగ్యకరమైనది మరియు లీన్ ప్రోటీన్, ఫైబర్ మరియు మంచి కొవ్వులతో సమృద్ధిగా ఉండేలా చూసుకోవాలి. బరువు తగ్గడానికి ప్రయత్నిస్తున్నప్పుడు బరువు చూసేవారు తరచుగా ఫ్యాన్సీ ఫుడ్స్ వైపు ఆకర్షితులవుతారు. కానీ నిజం ఏమిటంటే, మన రోజువారీ భారతీయ ఆహారం సమానంగా ఆరోగ్యకరమైనది మరియు బరువు తగ్గడానికి సహాయపడుతుంది.మీరు ఈ సంవత్సరం బిడ్డను పొందాలనుకుంటున్నారా? ఐతే ఈ విషయాలు పాటించండి..!మీరు ఈ సంవత్సరం బిడ్డను పొందాలనుకుంటున్నారా? ఐతే ఈ విషయాలు పాటించండి..!పోహామహారాష్ట్రలో ప్రసిద్ధి చెందిన పోహా ప్రతి ఒక్కరికీ ఎంపిక చేసుకునే ఆరోగ్యకరమైన అల్పాహారం. ఇది ఉల్లిపాయలు, బంగాళాదుంపలు మరియు తరిగిన మిరపకాయలు, దంచిన వేరుశెనగలు, కరివేపాకు మరియు నిమ్మకాయ వంటి సుగంధ ద్రవ్యాలతో తయారు చేయబడింది. ఇది చాలా తేలికగా జీర్ణం అవుతుంది .గుడ్లు తింటే మధుమేహం వస్తుందా? పరిశోధనల్లో షాకింగ్ ఫలితాలు ఏం చెబుతున్నాయో తెలుసా?గుడ్లు తింటే మధుమేహం వస్తుందా? పరిశోధనల్లో షాకింగ్ ఫలితాలు ఏం చెబుతున్నాయో తెలుసా?తక్కువ కేలరీల మైక్రోవేవ్ డోక్లా డోక్లా అనేది పులియబెట్టిన, కాల్చిన చిరుతిండి. ఇది గుజరాత్‌లో తయారు చేయబడిన ఆహారం మరియు తక్కువ కేలరీల అల్పాహారం. ఇది బహుముఖ ఎంపిక. ఎందుకంటే దీనికి ఎటువంటి విస్తృతమైన ప్రక్రియ అవసరం లేదు మరియు బేసన్, మిరపకాయ, పెరుగు, సుజి మరియు కరివేపాకు వంటి కొన్ని పదార్థాలతో మైక్రోవేవ్‌లో సులభంగా తయారు చేయవచ్చు.హార్మోన్ల రుగ్మతల వల్ల వచ్చే చర్మ సమస్యలను సరిచేయడానికి మహిళలు ఏమి చేయాలో తెలుసా?హార్మోన్ల రుగ్మతల వల్ల వచ్చే చర్మ సమస్యలను సరిచేయడానికి మహిళలు ఏమి చేయాలో తెలుసా?వోట్మీల్:ఓట్స్ వివిధ ఆరోగ్య ప్రయోజనాలను కలిగి ఉన్నాయి. ఓట్స్‌తో చేసిన ఇడ్లీ జీర్ణాశయానికి మంచిది మరియు ఇది ఒక అద్భుతమైన స్నాక్ ఎంపిక. ఎందుకంటే ఇది మీ జీర్ణక్రియను తేలికగా మరియు సరిగ్గా మారుస్తుంది. ఇది వేయించబడదు, కాబట్టి, ఇందులో కేలరీలు లేవు. ఇందులోని ప్రోటీన్ మరియు ఫైబర్ మీకు ఉత్తమ ఎంపికగా చేస్తుంది. ఓట్ మీల్ ముఖ్యంగా బరువు తగ్గడానికి సహాయపడుతుంది.పచ్చి బఠానీ ఉప్మాపౌష్టికాహారం మరియు పొట్టకు అనువైనది, ఉప్మా దక్షిణ భారత అల్పాహారం ఎంపిక. ఇది మీ ఆకలిని అదుపులో ఉంచుతుంది. పచ్చి బఠానీలను జోడించడం వల్ల మీ ఆహారంలో ప్రోటీన్ మొత్తాన్ని నియంత్రించడంలో మరియు దాని రుచిని పెంచడంలో సహాయపడుతుంది. దీంతో బరువు తగ్గుతారు.కాలీఫ్లవర్ తందూరితందూరి కాల్చినది లేదా వేయించినది కాదు. అంటే ఇందులో కేలరీలు తక్కువగా ఉంటాయి మరియు అన్ని సంతృప్త కొవ్వులు లేవు. కాలీఫ్లవర్ బరువు తగ్గడానికి ఫైబర్ యొక్క అద్భుతమైన మూలం. అలాగే తందూరీ మీరు బరువు తగ్గడానికి మరియు అదనపు కొవ్వు లేకుండా ఆరోగ్యంగా ఉండటానికి సహాయపడుతుంది.రాగి దోస గోధుమ కొవ్వు విషయానికి వస్తే, రాగి సాపేక్షంగా తక్కువ కొవ్వు ఉన్న ప్రత్యామ్నాయ ధాన్యం. ఇది బియ్యం లేదా పప్పు పిండితో దోస చేయడానికి ఉపయోగిస్తారు. ఇందులో పీచుపదార్థం ఎక్కువగా ఉండటం వల్ల మనం ఎక్కువ కాలం ధనవంతులుగా ఉండేందుకు సహాయపడుతుంది. కాబట్టి ఎక్కువ సమయం తినడం తగ్గించండి.


# కిచ్చా సుదీప్ 'విక్రాంత్ రోణ' కు భారీ ఆఫర్

'బాహుబలి' తరువాత దక్షిణాదిలో పాన్ ఇండియా చిత్రాల పరంపర మొదలైంది. ఏ హీరో చూసినా పాన్ ఇండియా సినిమా మాటే.. ఏ భాషలో చూసినా పాన్ ఇండియా సినిమానే మాట వినిపిస్తోంది. కన్నడ నాట 'కేజీఎఫ్' రూపొంది దేశ వ్యాప్తంగా ఆరు భాషల్లో సంచలన విజయాన్ని సొంతం చేసుకున్న విషయం తెలిసిందే. దక్షిణాదితో పాటు ఈ మూవీ ఉత్తరాదిలోనూ అనూహ్యంగా వసూళ్లని రాబట్టి సరికొత్త రికార్డులు సృష్టించింది. దీంతో చాప్టర్ 2పై భారీ అంచనాలు ఏర్పడ్డాయి.ఈ మూవీ వసూళ్ల పరంగా రికార్డులు తిరగరాయడంతో కన్నడ సినిమా అంటే క్రేజ్ ఏర్పడింది. దీన్ని దృష్టిలో పెట్టుకుని ఇప్పుడు ఆ భాషలో రెండు భారీ పాన్ ఇండియా స్థాయి చిత్రాలు రూపొందుతున్నాయి. అందులో ఉపేంద్ర నటిస్తున్న 'కబ్జ' ఒకటి కాగా మరొకటి కిచ్చా సుదీప్ నటిస్తున్న 'విక్రాంత్ రోణ'. అనూప్ బండారి అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తున్న ఈమూవీలో ఇండియన్ సూపర్ హీరోగా కిచ్చా సుదీప్ నటిస్తున్నారు.హాలీవుడ్ చిత్రాలకు ఏమాత్రం తీసిపోని స్థాయిలో ఫాంటసీ యాక్షన్ అడ్వెంచరస్ థ్రిల్లర్ గా ఈ మూవీని 3డీ ఫార్మాట్ లో రూపొందిస్తున్నారు. ఈ చిత్రాన్ని ఫిబ్రవరి 24న రిలీజ్ చేస్తున్నట్టు నిర్మాత జాక్ మంజు నాథ్ సోషల్ మీడియా ట్విట్టర్ వేదికగా శనివారం ప్రకటించారు. అంతే కాకుండా ఓ ఆసక్తికరమైన విషయాన్ని కూడా ఈ సందర్భంగా ప్రకటించారు.అత్యంత భారీ బడ్జెట్ తో కనివినీ ఎరుగని సరికొత్త సాంకేతికతతో త్రీడీ చిత్రంగా రూపొందించిన ఈ మూవీ ఓటీటీ రిలీజ్ కోసం ఓ ప్రముఖ ఓటీటీ దిగ్గజం 100 కోట్లు ఆఫర్ చేసిందని అయితే ఆ ఆఫర్ ని తాము సున్నితంగా తిరస్కరించామని 'విక్రాంత్ రోణ' బిగ్ స్క్రీన్ లో మాత్రమే చూడదగ్గ సినిమా ఇదని ఇలాంటి చిత్రాన్ని థియేటర్లలో మాత్రమే చూసి అనుభూతిని పొందాలని. అందుకే ఈ మూవీని థియేటర్లలో మాత్రమే రిలీజ్ చేస్తున్నామని స్పష్టం చేశారు.గత కొన్ని రోజులుగా భారీ చిత్రాలకు ఓటీటీ ప్లాట్ ఫామ్ లు భారీ ఆఫర్లు అందిస్తూ టెమ్ట్ చేస్తున్న విషయం తెలిసిందే. అయితే బిగ్ స్క్రీన్ పై మాత్రమే మా సినిమాలని చూసిన ప్రేక్షకులు సరికొత్త అనుభూతికి లోనవ్వాలని చాలా మంది మేకర్స్ తమకు ఓటీటీ ప్లాట్ఫామ్ లు ఇస్తున్న భారీ ఆఫర్లని సున్నితంగా తిరస్కరిస్తున్నారు. 'విక్రాంత్ రోణ' 3డీ ఫార్మాట్ లో రూపొందిన సినిమా కావడం. దీన్ని థియేటర్ లో చూస్తేనే ఆ అనుభూతి కలుగుతుందని భావించిన మేకర్స్ ఈ మూవీని ఓటీటీకి ఇవ్వడం లేదని థియేటర్లలో మాత్రమే రిలీజ్ చేస్తున్నామంటూ శనివారం ప్రకటించడం విశేషం.ఇటీవల ఈ మూవీ టీజర్ తో పాటు టైటిల్ లోగోని బూర్జ్ ఖలీఫాపై ఆవిష్కరించిన విషయం తెలిసిందే. ఇలా ఆవిష్కరించిన తొలి ఇండియాన్ సినిమాగా 'విక్రాంత్ రోణ' రికార్డుని సొంతం చేసుకుంది. దీంతో ఈ మూవీపై వరల్డ్ వైడ్ గా భారీ క్రేజ్ ఏర్పడింది. అంతే కాకుండా రీసెంట్ గా రిలీజ్ చేసిన టీజర్ సుదీప్ ని ఈ మూవీలో సూపర్ పవర్స్ వున్న సూపర్ హీరోగా చూపించబోతున్నారు.





# మళ్లీ వాయిదా పడనున్న 'సర్కారు వారి పాట'..?

సూపర్ స్టార్ మహేష్ బాబు హీరోగా పరశురామ్ పెట్లా దర్శకత్వంలో తెరకెక్కుతున్న తాజా చిత్రం "సర్కారు వారి పాట". సమ్మర్ కానుకగా ఏప్రిల్ 1వ తేదీన ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు మేకర్స్ ప్రకటించారు. అయితే చెప్పిన సమయానికి ఈ సినిమా విడుదల కాకపోవచ్చనే కామెంట్స్ ఇప్పుడు ఫిలిం సర్కిల్స్ లో వినిపిస్తున్నాయి.నిజానికి 'సర్కారు వారి పాట' చిత్రాన్ని సంక్రాంతి సందర్భంగా జనవరి 13న రిలీజ్ చేయాలని అనుకున్నారు. అయితే బాక్సాఫీస్ వద్ద ఆసక్తికరమైన పోటీ కోసం వాయిదా వేసుకున్నారు. వేసవిని టార్గెట్ గా పెట్టుకొని మెజారిటీ భాగం నిర్మాణం పూర్తి చేసుకున్న ఈ సినిమా షూటింగ్ కు బ్రేక్ పడింది. మహేష్ బాబు మోకాలికి శస్త్రచికిత్స జరగడంతో కాస్త విరామం ప్రకటించారు.అయితే ఇప్పుడు మహేష్ కరోనా బారిన పడ్డారు. దీని వల్ల సూపర్ స్టార్ ఇప్పుడప్పుడే బయటకు వచ్చే అవకాశాలు తక్కువ. ఎందుకంటే హెల్త్ విషయంలో అట్ మోస్ట్ కేర్ తీసుకునే మహేశ్.. ఇప్పుడు తనకే వైరస్ సోకడంతో బయటకు రావడానికి మినిమం రోజులు తీసుకునే అవకాశం ఉందని సమాచారం.అందులోనూ రోజురోజుకు దేశవ్యాప్తంగా కరోనా మరియు ఒమిక్రాన్ కేసులు పెరుగుతూ వస్తున్నాయి. ఇప్పటికే కొన్ని రాష్ట్రాల్లో ఆంక్షలు విధించారు. ఈ నేపథ్యంలో పలు సినిమాల షూటింగ్స్ కూడా వాయిదా వేసుకున్నారు. కరోనా థర్డ్ వేవ్ ఉధృతి ఇలానే కొనసాగితే 'సర్కారు వారి పాట' వంటి పెద్ద సినిమాల షూటింగ్ లకు ఇబ్బంది తప్పదు. ఇదే జరిగితే మరోసారి సినిమాలు పోస్ట్ పోన్ అవుతాయని అనుకోవచ్చు.ఒకవేళ 'సర్కారు వారి పాట' సినిమా చిత్రీకరణ పూర్తి చేసుకున్న రెడీ అయిన.. అదే సమయంలో 'ఆర్.ఆర్.ఆర్' రావాలని అనుకుంటే మరోసారి వెనక్కి వెళ్లే అవకాశం కూడా లేకపోలేదని టాక్ నడుస్తోంది. మరి రాబోయే రోజుల్లో ఏమి జరుగుతుందో చూడాలి. కాగా 'సర్కారు వారి పాట' చిత్రంలో మహేష్ బాబు సరసన కీర్తి సురేష్ హీరోయిన్ గా నటిస్తోంది. సముద్ర ఖని - ప్రకాష్ రాజ్ - వెన్నెల కిషోర్ - సుబ్బరాజు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఎస్.ఎస్. థమన్ ఈ చిత్రానికి సంగీతం సమకూరుస్తుండగా.. ఆర్. మది సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ - 14 రీల్స్ ప్లస్ - జీఎంబీ ఎంటర్టైన్మెంట్స్ సంస్థలు భారీ బడ్జెట్ తో ఈ సినిమాని నిర్మిస్తున్నారు.





# ఎన్టీఆర్ లాంచ్ చేసిన 'రౌడీ బాయ్స్' ట్రైలర్..!

టాలీవుడ్ స్టార్ ప్రొడ్యూసర్ దిల్ రాజు సోదరుడు శిరీష్ తనయుడు ఆశిష్ హీరోగా పరిచయం అవుతున్న చిత్రం "రౌడీ బాయ్స్". శ్రీహర్ష కొనుగంటి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో అనుపమ పరమేశ్వరన్ హీరోయిన్ గా నటించింది. సంక్రాంతి కానుకగా జనవరి 14న ఈ సినిమాని థియేటర్లలో విడుదల చేస్తున్నారు.రిలీజ్ డేట్ దగ్గర పడుతుండటంతో 'రౌడీ బాయ్స్' మేకర్స్ ప్రమోషన్స్ స్పీడ్ పెంచారు. ఇప్పటికే ఈ చిత్రం నుంచి విడుదలైన పోస్టర్స్ - టీజర్ - సాంగ్స్ ప్రేక్షకులను విశేషంగా అలరించాయి ఈ నేపథ్యంలో తాజాగా యంగ్ టైగర్ ఎన్టీఆర్ చేతుల మీదుగా ట్రైలర్ ను ఆవిష్కరించారు. "ట్రైలర్ చాలా ప్రామిసింగ్ గా ఉంది. అరంగేట్రం చేస్తున్న ఆశిష్ కి నా శుభాకాంక్షలు. అలాగే రాజు గారు - శిరీష్ గారు - శ్రీ హర్ష - అనుపమ మరియు టీమ్ మొత్తానికి శుభాకాంక్షలు" అని తారక్ ట్వీట్ చేశారు.ఇక ట్రైలర్ విషయానికొస్తే.. కాలేజీ అంటే మంచి మంచి పోరీలు.. మస్తు మస్తు పార్టీలు - క్రేజీ ఈవెంట్స్ అని చెప్పడంతో ప్రారంభమవుతుంది. ఇది కాలేజ్ బ్యాక్ డ్రాప్ లో సాగే యూత్ ఫుల్ కమర్షియల్ ఎంటర్టైనర్ అని తెలుస్తోంది. తండ్రితో తిట్లు తినే బాధ్యతలేని కుర్రాడిగా హీరో ఆశిష్ ను చూపించారు. ఇంజినీరింగ్ స్టూడెంట్ అయిన హీరో.. మెడికల్ కాలేజీకి చెందిన హీరోయిన్ అనుపమని ప్రేమించడం వల్ల జరిగిన గ్యాంగ్ వార్స్ ను ఇందులో ప్రధానంగా చూపించారు.నిర్మాత లగడపాటి శిరీష్ తనయుడు సహిదేవ్ విక్రమ్ - కార్తీక్ రత్నం - శ్రీకాంత్ అయ్యంగార్ - తేజ్ కూరపాటి - కోమలీ ప్రసాద్ తదితరులు కీలక పాత్రల్లో కనిపిస్తున్నారు. తొలి సినిమా అయినప్పటికీ ఆశిష్ ఎనర్జిటిక్ స్క్రీన్ అప్పీరియన్స్ తో ఆకట్టుకున్నాడు. అనుపమ క్యూట్ గా కనిపించడమే కాదు.. రొమాంటిక్ సీన్స్ చేసి ఆశ్చర్యపరిచింది. లవ్ అండ్ యాక్షన్ కలబోసిన 'రౌడీ బాయ్స్' ట్రైలర్ అలరిస్తోంది. 'ప్రేమదేశం' తరహా సినిమాని చూడబోతున్నట్లు హింట్ ఇస్తోంది.రాక్ స్టార్ దేవిశ్రీప్రసాద్ ఈ చిత్రానికి సంగీతం సమకూర్చారు. మధీ సినిమాటోగ్రఫీ అందించగా.. రాజీవన్ ప్రొడక్షన్ డిజైనింగ్ చేశారు. రామాంజనేయులు ఆర్ట్ డైరెక్టర్ గా.. మధు ఎడిటర్ గా వర్క్ చేశారు. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్ పై దిల్ రాజు - శిరీష్ ఈ చిత్రాన్ని నిర్మించారు. హర్షిత్ రెడ్డి సహ నిర్మాతగా వ్యవహరించారు. దిల్ రాజు ఫ్యామిలీ నుంచి హీరోగా రాబోతున్న ఆశిష్ కు "రౌడీ బాయ్స్" సినిమా ఎలాంటి విజయాన్ని అందిస్తుందో చూడాలి.




# హనుమ విహారికి నో ఛాన్స్.. పంత్‌కు అవకాశం... సిరాజ్ స్థానంలో అతడే! ఎందుకంటే..



దక్షిణాఫ్రికాలో సరికొత్త చరిత్ర సృష్టించాలంటే మూడో టెస్టులో టీమిండియా కచ్చితంగా గెలిచి తీరాలి. అప్పుడే ఇన్నాళ్లుగా భారత జట్టుకు సఫారీ గడ్డపై అందని ద్రాక్షగా ఉన్న టెస్టు సిరీస్ విజయం సొంతమవుతుంది. అయితే, గాయాల బెడద కోహ్లి సేనకు పెద్ద తలనొప్పిగా మారింది. వెన్ను నొప్పి కారణంగా దూరమైన రెగ్యులర్ కెప్టెన్ విరాట్ కోహ్లి జట్టులోకి రావడం ఖాయంగా కనిపిస్తున్నా ఆఖరి నిమిషం వరకు ఎటూ చెప్పలేని పరిస్థితి. ఇక కీలక ఫాస్ట్‌బౌలర్ మహ్మద్ సిరాజ్ గాయం కారణంగా దూరమైన సంగతి తెలిసిందే. వీటికి తోడు మిడిలార్డర్ వైఫల్యం గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. అదే విధంగా రిషభ్ పంత్ వంటి కీలక ఆటగాడు అనవసరపు షాట్లతో వికెట్ పారేసుకోవడం తీవ్ర ప్రభావం చూపుతోంది. అతడిని తుది జట్టు నుంచి తప్పించాలనే వాదనలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో టీమిండియా మాజీ క్రికెటర్ వసీం జాఫర్ మాత్రం.. ఈ వికెట్ కీపర్‌ను జట్టులో కొనసాగించాలని అంటున్నాడు.ఇన్‌సైడ్ స్పోర్ట్‌తో అతడు మాట్లాడుతూ.. "రిషభ్ పంత్ లాంటి ఆటగాడిని మేనేజ్‌మెంట్ పక్కన పెడుతుందని నేను అనుకోవడం లేదు. ఎందుకంటే టీమిండియాకు తనే ఎక్స్ ఫ్యాక్టర్. మ్యాచ్ విన్నర్. షాట్ సెలక్షన్ గురించి కెప్టెన్ విరాట్, కోచ్ రాహుల్ ద్రవిడ్ అతడితో మాట్లాడితే సరిపోతుంది. కేవలం కీపింగ్ నైపుణ్యాల గురించి మాట్లాడుకుంటే వృద్ధిమాన్ సాహా పంత్ స్థానాన్ని భర్తీ చేయగలడు. కానీ... బ్యాటింగ్‌లో పంత్ ఎన్నో మెట్లు పైనే ఉంటాడు" అని చెప్పుకొచ్చాడు. ఇక కాస్త కఠిన నిర్ణయమే అయినా... హనుమ విహారిని తుది జట్టు నుంచి తప్పించడం ఖాయమని వసీం జాఫర్ అభిప్రాయపడ్డాడు. రెండో టెస్టులో అతడు బాగానే ఆడినా.. పుజారా, రహానే అర్ధ సెంచరీలతో రాణించడంతో వాళ్లు కచ్చితంగా మూడో టెస్టు తుది జట్టులో ఉంటారని పేర్కొన్నాడు. విరాట్ వస్తున్నాడు కాబట్టి... విహారిపై వేటు తప్పదన్నాడు.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH.
PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190